# గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

## అక్టోబర్ 2013

## కథలు




ఆదివారం విశ్రాంతి గా పడక్కుర్చీలో శ్రీమతి అందించిన మూడోకప్పు కాఫీ తాగి టీపాయ్ మీద కాళ్ళు బారచాపుక్కూర్చుని తెలుగు పేపర్లన్నీ పరీక్షకెళ్ళే కుర్రడిలా చదివినవే చదివినవే చదువుతూఆనందిస్తున్నాడు మాణిక్యరావు. ఆదివారం అలా రిలాక్స్ కావటమంటే అతడికెంతో ఇష్టం. పనిదినాల్లో పడ్డ శ్రమనంతా అలామర్చి పోతుంటాడతగాడు. ఆరోజు అస్సలు మొబైల్ ఫోన్ ఎత్తడుగాక ఎత్తడు. దాన్ని స్విచ్ ఆఫ్ చేసి స్టోర్రూంలో బియ్య బ్బస్తాచాటున పెడతాడు . అతడి ఆనందాన్ని భంగపరుస్తూ ల్యాండ్ లైన్ మోగింది .సంతోష సముద్రంలో ఈదు లాడు తున్న అతగాడికి ఎదురుగా మొసలి వచ్చి వికటాట్టహాసం చేసినట్లు అదిరిపడి తలెత్తి చూశాడే కానీ లేచి ఫోన్ ఎత్తలేదు. అతగాడు తాగి ఖాళీ చేసిన మూడో కాఫీకప్పు తీసుకెళ్ళేందు కొచ్చిన అతడి సతీమణి సుందర మణి , "ఏమండీ ! ఫోన్ అలా కుక్కపిల్లలా అరుస్తుంటే లేచి చూడరేం? మొబైల్ ఎటూ ఆపేస్తారు ,ల్యాండ్ఫోనూ తీయరా ! మీ తపస్సు కూలా! " అంటూ వెళ్ళి తీసుకుని, " హల్లో ! నేను సుందరమణి ని మాట్లాడుతున్నాను, ఎవరుకావాలండీ!" అని అడిగింది.

అవతలి కంఠం విని " ఓ మీరా వదినగారూ! ఉండండి పిలుస్తాను ,మీతమ్ముడు ఆదివారం ఆనందాబ్ధిలో ఉన్నారు లెండి" అంటూ మౌత్ పీస్ మూసి," వదినగారండీ! అదే మీ అలివేలు అక్కగారండీ!" అంటూ తెచ్చి అందించింది.

" హలో అక్కా! ఏంటే పొద్దుటే ఫోన్ చేశావు?" అన్నాడు , సదా సీదాగా మాణిక్యరావ్, సోఫాలో ముందుకు వంగి.

"పొద్దుటే ఏంటిరా! నీకు ఆదివారం పదైతేకానీ తెల్లారదు.మొబైల్ ఆదివారం ఆపేస్తావాయె ! తెల్లారు ఝామునుంచి ఎప్పుడు పదవుతుందాని ఎదురుచూస్తున్నానురా!.." నిష్ఠూరంగా అంది అక్క అలివేలు.

" సర్లే వే చెప్పు విషయమేంటో , అర్జెంటా? " తనవిసుగునంతా కంఠంలో కనిపించకుండా దాచుకుంటూ అన్నాడు.

" అయ్యో అర్జెంటేంటిరా! అతిజరూరు విషయం,మీరెండో మేనకోడలు మేనక పెళ్ళి నిశ్చయమైందిరా!..."

" ఆ .." అంటూ సోఫాలో వెనక్కు పడిపోయిన భర్తను చూసి సుందరమణి దగ్గరకొచ్చి,"ఏమైందండీ!అక్కడ అంతా క్షేమమేగా! ఎందుకండీ అలా కంగారుగా పడిపోయారు? చెప్పండీ!.." అంటూ అడిగి ,అతగాడేమీ మాట్లాడక పోడం తో , క్రింద పడ్డఫోన్ అందుకుని " వదినా చెప్పండీ! ఏంటి విషయం? అంతా కులాసేగా! " అంది .

“ఏంటే మరదలుపిల్లా ! వాడలా ఫోన్ కట్ చేశాడూ!”

" ఏంలేదులెండి వదినా !రాత్రి పొద్దుపోయివచ్చారు,ఆఫీస్లో పనివత్తిడి, నడుంపట్టుకున్నట్లుంది వెనక్కువాలా రంతే. అసలు విషయం చెప్పండి వదినా!" అంది సుందరమణి, భర్త అభినయాన్ని కప్పిపుచ్చుతూ, అర్ధాంగి కదామరి!

"ఏం ! మాతమ్ముడు మేమమామై ఉండీ అన్నీ పట్టించుకుని వెతికి మేనకోడలిపెళ్ళి చేయాల్సిందిపోయి ,'నీ రెండో మేనకోడలి పెళ్ళికుదిరిందిరా ! ‘అనగానే ,'ఆ ' అంటూ అరుస్తాడా!” అంటూ మరదలుపై కారాలూ మిరియాలూ నూరుతున్న వదినగారిని, చల్లబరుస్తూ “వదినా! ఆయన సరిగా విని ఉండరులే గానీ పాపం నడుంపట్టి కూర్చు న్నట్లున్నారు , ఇస్తానుండండి.." అంది, సహధర్మచారిణి కనుక సమయానుకూలంగా సందర్భసహితంగా ఇబ్బందిలేని అబద్ధం చెప్తూ.

“సరేలే విను విషయం ,అసలి సంబంధ కుదురుతుందని అనుకోనేలేదు. అబ్బాయి బావుంటాడు, మన మేనకని చూడగానే ఇష్ట

పడ్డారు. పిల్లా పిల్లాడూ ఈడూ జోడూ బాగా కుదిరింది. ఇంటి కెళ్ళి చెప్తామని రాత్రి పదకొండింటికే పెళ్ళి మూహూర్తంతో సహా ఫోన్ చేశారు.నా గుండెల మీద కుంపటి దిగిపోతున్నందుకు హాయిగా ఉంది సుందరీ!

సరేలేవాడినడుం నొప్పిసర్దుకున్నాక , తీరుబాటుగా ఫోన్ చేయమను. ముందుగా వచ్చి అన్నీ చేయాలి. పై నెల్లో నే ఐదో తేదీ ఆదివారం పెళ్ళి. చెప్పువాడికి, ముందుగా సెలవు పెట్టుకురమ్మను. ఇంకా అందరికీ చెప్పాలి " అంటూ ఫోన్ కట్ చేసింది.

ఫోన్ పెట్టేసి," అదేంటండీ! మీ రెండో మేనకోడలు పెళ్ళని చెప్తే సంతోషించడంపోయి, అలా వెర్రి అరుపు అరిచి వెన క్కు పడి పోయా రేంటండీ ! అవతల మీ అక్కగారే మనుకుంటారోని అతికినట్లు అబద్ధం చెప్పాల్సివచ్చింది!" అంది ఆశ్చర్యం గా సుందరమణి.

" సరేలే ఉద్ధరించావు.దానిపెళ్ళి కుదిరిందంటే బాధ నాకా నీకా! పెద్ద మేనకోడలిపెళ్ళినిర్వహించిన బాధ ఇంకా తగ్గనే లేదు. " అరిచినంత పని చేశాడు మాణిక్యరావు.

" ఇది మరీ బావుందండీ! ఉరు మిరిమి మంగలం మీదపడ్డమంటే ఇదేమరి!మీ అక్క కూతురిపెళ్ళి , మాట్లా డింది మీ అక్కా! మధ్యలో నాకెంటిట! ,కోపందీసి దాన్ని గాని చేసుకోవాలనుకున్నారేంటీ? మా అన్నలిచ్చే కట్న కానుకలకు లోబడి నన్ను చేసుకుని దాన్ని మనస్సులో పూజిస్తున్నా రా!" గొంతు గాద్గదికంకాగా అంది సుందర మణి.

ఉలిక్కిపడి భార్యవైపుచూస్తూ " ఛ నోర్ముయ్ ! దాన్ని నేను చేసుకోడమేంటే! పిచ్చిగానీ ఎక్కలేదు కదా!"" అదేంటో మీకే ఎక్కి ఉండాలి.నాక్కాదు. అసలు మీరెందుకు మీ రెండో మేనకోడలి పెళ్ళికుదిరిందంటే బాధపడు తున్నారో తేల్చండి." అంటూ ఎదురుగ్గా నేలమీదే మఠం వేసుకు కూర్చుంది సుందరమణి.

" చూడూ సుందరీ! నీవెప్పుడైనా నా మేనకోడళ్ళని చూశావా? రెండో మేనకోడలు మేనకని చూశావా!"

చూడకేం! ఫోటోలో చూశాన్లే!"ముఖంత్రిప్పుకుంటూ అంది సుందరి, లోలోపల ' మేనక నిజంగా నే మేనకంత అందగత్తె! . మరి ఈయనెందుకు దాన్ని చేసుకోకుండా నన్ను చేసుకున్నట్లూ!'అని కూడా అనుకుంది

"చూడూ ! సుందరీ నీమీద ఒట్టు.దాన్ని నేను చేసుకోవాలని అనుకోలేదు కలనైనా గానీ.నీకెట్లాచెప్పాలో తెలిట్లే దులే!

మనపెళ్ళికి అది రాలేదులే. కాలేజ్ విహారయాత్రలకెళ్ళింది. పెద్దదాని పెళ్ళై అమేరికావెళ్లిపోయింది. మొన్న ఆఫీస్ పనిమీద వెళ్ళినపుడు ఓగంట ఖాళీ ఉంటే వెళ్ళాను . నామీద లేనిపోని అనుమానాలు పెట్టుకుని మన సంసా రంలో చిచ్చుపెట్టకు. ఈ విషయం ఇంతటితో వదిలెయ్! నిజం నిలకడమీద తెలుస్తుందిలే!...సరి లేలే నా బుజ్జివి కదూ!"అంటూ లేపి తానూ తోడుగా వంట గదిలోకి వెళ్ళాడు మాణిక్యరావు..

రోజులు క్షణాల్లా గడచిపోతున్నాయి.రోజురోజుకూ మాణిక్యరావు చింత పెరిగిపోతూ , పలవరింతలు, భయాలూ ఇంతింతై వటుడింతై అన్నట్లు పెరిగి, తిండి, నిద్రలకు దూరమైపోసాగాడు.మనిషి చిక్కిపోతున్నాడు. సుందరమణి భర్త బాధ అర్థంకాక , అనుమానించను కారణం సరిగా తోచక ,ఆంజనేయస్వామి ఆలయానికెళ్ళి అర్చన చేయించి సింధూరం తెచ్చి నుదుటపెట్టింది. సాయిబాబా గుడి కెళ్ళి విభూది తెచ్చి నుదుట నుంచసాగింది.రాత్రుళ్ళు తనని అంటి పెట్టుకుని పసి పిల్లాడిలా పడుకుంటున్న భర్తను అనుమానించడం పాపమని లెంపలేసుకో సాగింది సుందరమణి.

ఇహ పెళ్ళి వారముందనగా ఆరోజుమళ్ళా అలివేలుఫోను.సుందరి ఫోన్ తీసుకుని " చెప్పండి వదినా! మీతమ్ము లుంగారు బాగా బిజీ గానే ఉన్నారు పాపం.మీరేం కంగారు పడకండి వచ్చేస్తాంగా! సెలవుపెడతారు లెండి. మేన కోడలి పెళ్ళికి ఆమాత్రం చేయకపోతే ఎలాగా!" అంది ." నీవేమేలమ్మా! వీడికి బొత్తిగా బాధ్యత తేలినే లేదు.సరే తల్లీ పనులన్నీ అవుతున్నైకానీ , మీ ఊర్లో గంపలవీ బాగా నేస్తారుటగా!పెళ్ళికూతురి గంప తెస్తారేంటే మరదలా?"

" ఉండండిమీతమ్ముడ్ని అడుగుతాను....స్నానం చేసినట్లున్నారు వస్తున్నారు...అంటూ పక్కనే ఉన్న భర్త వైపు చూసింది.అతగాడి సైగలు సరిగానే అర్థం చేసుకుని ," వదినా ! ఇప్పుడంత బాగా నేసేవారులేరుట! పాపం చేతి పనులవాళ్ళు తిండిగడవక కూలినాలి పనులకు పోతున్నారుట. మీరు అక్కడే ప్రయత్నించండి.కావలిస్తే మా అన్నా వదినల్ని అడగనేంటి? వారుమాపెళ్ళికి తెచ్చిన గంప చాలా బావుందని అంతా మెచ్చుకున్నారుగా!!" అంది సుందరమణి.

" సర్లే నేనే ఏదో తంటాలు పడతాన్లే!" అంటూ ఫోన్ పెట్టేసింది అలివేలు.

" చూడండీ ఇలా మాటిమాటికీ నేను మీతరఫున అసత్యాలు చెప్పలేనండీ!మీ అసలు బాధేంటో చెప్పకూడదు టండీ!ఏదైనా నివారణోపాయం ఆలోచిద్దాం." అంది సుందరి భర్త క్రాఫులోకి వేళ్ళుపోనిచ్చి అనునయిస్తూనూ.

" సుందరీ! తినబోతూ రుచి అడగటమెందుకూ ! వెళుతున్నాంగా చూద్దువుగాని.నాబాధ ఎవ్వరూ తీర్చలేనిదే సుందరీ!" అంటూ దిగులుగా ఉన్న భర్తను ఏమీ అనలేక పోయింది సుందరి.

ఇద్దరూ బట్టలు సర్దుకుని పెళ్ళికి బయల్దేరు తుండగా సుందరి తల్లికి సుస్తీగా ఉందని ఫోన్." సుందరీ నీవు నేరుగా మీ అమ్మదగ్గర కెళ్ళి పెళ్ళిరోజుకురా! నేను అక్క ఇంటి కెళతాను." అని భార్యను బుజ్జగించి ప్రయాణమయ్యాడు మాణిక్యరావు.

ఊరికి సగం దూరంలో ఉండగా " మీరూ నాతోరండి, మా అన్నాతమ్ముడూ మీకు మంచి దోస్తులుకదా! నాతో చెప్ప కుండా దాచిన బాధేంటో వారితో చెప్పండి,మీకు నివారణోపాయం చెప్తారు. ఇంటల్లుడు కదా మీరు! మీబాధ వారిబాధ కాకపోదు" అంది సుందరమణి. 'సరి ఇదీబాగానే ఉందనుకున్నాడు.మాణిక్యరావు.అతడికి తన బావ మరదుల మీద అమోఘమైన నమ్మిక. పెళ్ళి వారిల్లుకోలాహలంగా ఉంది.మగపెళ్ళివారు వచ్చేశారు.అంతా ఎదురెళ్ళి పెళ్ళికొడుక్కు కాళ్ళుకడిగి పూల మాలలు వేసి , కొబ్బరికాయ, పసుపునీళ్ళ దిష్టి తీసి లోపలికి , విడిది గృహంలోకి ఆహ్వానించారు. సుందరమణి కూడా వచ్చి ముత్తై దువుల్లోకలిసి పోయింది. మగపెళ్ళివారు ప్రయాణ బడలికతీరాక ,పెళ్ళి తతంగాలు మొదల య్యాయి. వరపూజ తర్వాత ,స్నాతకం పూర్తైంది.పెళ్ళికుమార్తె గౌరీపూజ అవుతుండగా, పెళ్ళికొడుకు కాశీ యాత్ర కు బయల్దేరాడు. కాశీయాత్రకు తర్వాతి జీవితంలో ఒక్కమారైనా వెళ్ళేదిలేకపోయినా, మామ నుంచి మంచి ఖరీదై న చెప్పులూ గొడుగూ ,బట్టలూ కొట్టేయనిదో దరువు.

అటునుంచి పెళ్ళిపీటల మీదకు చేరారు."పెళ్ళికూతుర్ని తీసుకురండి" అన్నాడు పురోహితుడు.

"మేనమామ ఎక్కడ? గంపలో కూర్చోబెట్టుకుని పెళ్ళికూతుర్ని మోసుకురావాలి " అంటున్నారు.
"

మేనమామ ఎక్కడా ?పిలవండి ముహూర్తం దాటిపోతుంది.వేగం వేగం." అని పురోహితుడి అరుపులు. ఎక్కడ వెతికినా మాణిక్యరావు కానరాలేదు. అంతా సుందరమణిని అడగసాగారు " ఏమమ్మాయ్! మీ ఆయనెక్కడ! ఎక్కడ దాచావు?" అంటూ సరసాలుకూడా సాగించారు. సుందరమణి వెళ్ళి అంతాచూసింది. మాణిక్యరావు మొబైల్ స్విచ్చాఫ్ చేసుంది.

అన్నలకూ ఫోన్ చేసింది. అన్నలు "వస్తాళ్ళేవే ఎక్కడి కెళతాడూ! అంతాకంగారెందుకే! ఉండుండు వచ్చేస్తాళ్ళే!" అని చివాట్లేశారు కూడా! సుందరమణికి ఏడుపొక్కటే తక్కువైంది. 'ఈపెళ్ళికుదిరిందని తెల్సినప్పట్నుంచి భర్త పడ్డ పాట్లు, భయాలూ, పలవ రింతలూ గుర్తుకువచ్చి చాటుగా వెళ్ళికళ్ళనీళ్ళు తుడుచుకుంది. పెళ్ళింట ఏడ్వటం ఎవరై నాచూస్తే బావుండదని భయం.

" పోనీ మేనమామ రాకపోతే వరసైన వారుంటే చూడండి ఫరవాలేదు." అన్నారెవరో " రాకపోడమేంటీ వచ్చాడు , ఎవరైనా అర్జంటు పని మీదగాని పంపారేమో! " అని ఎవరో అంటుండగా, " అతగాడుండగా మరొకరు పిల్లను బుట్ట లో పెట్టుకు తేవడ మేంటీ!" అంటూ అమ్మలక్కలు బుగ్గలునొక్కుకోసాగారు.వారు వచ్చేదిఇలాంటివాటికేకదామరి! అంతా కంగారుగా ఎదురు చూస్తుండగా మాణిక్యరావు వచ్చాడు.వెంట ఒక మనిషిచేత ఏదో మోయించు కొచ్చాడు. పక్కనే చిద్విలాసంగా నవ్వుతూ బావమరదులు! అంతా అదేంటని చూడసాగారు, చక్రాల బండి!. చాలా పెద్దది. లాగేందుకో కొత్త కొబ్బరితాడు. " ఇదెందు కండీ ఇప్పుడు !అంతా మీకోసం ఎదురు చూస్తుంటేనూ ,ఎక్కడి కెళ్ళారు చెప్పాపెట్టకుండానూ!" అంది సుందరమణి..

" సరి సరి రావోయ్ మరిదీ! మీ మెనకోడల్ని బుట్టలో పెట్టి ఎత్తుకు తెచ్చి పీటల మీదకు చేర్చు. ఇది నీపని." అన్నాడు అక్క మొగుడు బావ." అందుకేగా బావగారూ వెళ్ళింది.ఏదీ గంప తెండి" అంటూ , పెళ్ళికూతురు గౌరీపూజ చేస్తున్న గదిలోకి ఆబండి తీసుకెళ్ళి ,దానిమీద గంప పెట్టి దాన్లో మేనకను కూర్చోమని , ఎవ్వరి మాటలూ లెక్కచేయక , బండిలాక్కుంటూ తెచ్చి పెళ్ళి మంటపం ముందుంచాడు. మేనకను చేయి పట్టి లేపి పీటల మీద కోర్చోమన్నాడు.అంతా వింతగా నవ్వటం, బుగ్గలు నొక్కుకోడం, గూసగుసలూ పకపకలూ, వికవికలూనూ. ఎవరో పెద్దావిడ పెద్దగానే తన వయస్సుకున్న హోదా చాటు కుంటూనూ అంది " ఔనర్రా! పూర్వం ' అష్ట వర్షాత్ భవేత్ కన్యా ..' అని ఎనిమిదేళ్ళ లోపు పిల్లల్ని గంపలో ఎత్తుకు తెచ్చి కూర్చోబెట్టేవారు. ఏడు మల్లె పూలంత బరువు కూడా వుండే వారుకారు ఆచిన్న పిల్లలు. అదో సరదా ఆనాడు. ఇప్పుడు ఈ ఇరవై ఎనిమిదేళ్ళ పిల్లల్ని ఎంత మేన మామైతేనేం ఎలా ఎత్తుకువస్తాడు చెప్పండి.ఈబండి విధానం బావుంది.దీన్ని అన్ని పెళ్ళిమంట పాల కూ పరిచయం చేద్దాం. పాపం మేనమామ చూస్తే బక్కపల్చనా, పెళ్ళికుమార్తె ఆడవస్తాదూ ! బావుందోయ్ నీ ఆలోచన." అంది . ఎవ్వరూ నోరెత్తలేదు.

" అంతేకాదు ఈ కాశీయాత్ర నిజమా! పెళ్లిలోవధూవరులను ఆకాశం కేసి చూడమంటూ, పెళ్ళి హాల్లో పైకప్పుకేసి చూపుతూ అరుంధతీ నక్షత్రాన్ని చూపటం ధర్మమా!ఎందుకొచ్చిన మానుకోలేని ఆచారాలు చెప్పండీ! ఆమంత్రాల అర్ధాలు వివరించి చెప్పి వధూవరులు ఎలా తమ నూతన జీవితంలో ప్రవర్తించా లో చెప్తే చాలదూ! కాడిమాను ఆట బొమ్మైంది.మరి ఇలా బండీలో తెస్తే తప్పేంటీ! కొత్త ఒరవడి తెచ్చావయ్యా! బావుంది. " అంటూ మెచ్చుకుని మేక తోలు కప్పిందావిడ మాణిక్యరావుకు.

" వెనుక పిల్లా పిల్లాడూ ఒకర్నొకరు చూసుకునే వారు కూడా కాదు ముహూర్తం వరకూనూ. తలపై జీలకర్రా బెల్లం పెట్టాక మంచి సమయంలో తొలిచూపులు చూసుకుని జీవితాంతం అలా ఒకర్నొకరు ఇష్టపడుతూ జీవించేవారు. అసలు కార్యక్రమాల అర్ధం, పరమార్ధం , అంతరార్ధం అటకెక్కి ఊరికే సరదాలకోసం మాత్రం తతంగాలు సాగిస్తున్నా రు.ఈతెర భాగోతమూ అదేకదా! ఇవన్నీ ఇలా జరుగు తుండగా బుట్టలోనేగా మేనమామతెస్తా! అది బండిపై నైతే నేమీ భుజంపై నైతేనేమి?మీలో ఎవరైనా వధువును కూర్చోబెట్టుకుని ఆబుట్టెత్తుకురండి, పదివేలు ఇస్తాను బహు మతి."అంటూ తన చేతిసంచీతీసి నోట్లకట్టలు సైతం చూపారావిడ! ఒక్కరైతేనేమి నోరెత్తితే ఒట్టు. గుండెనిండా గాలి పీల్చుకుంటూ, హాయిగా ఉన్న భర్త బాధ అర్ధమై ,ఇంత కాలంగా మేనకోడలి పెళ్ళని విన్నప్ప ట్నుంచి అతగాడు పడుతున్న బాధ అర్ధమై చిద్విలాసంగ హాసం చేసింది సుందరమణి. పెద్ద మేనకోడలు వధువు పక్కనే ఉండగా తలెత్తి చూసి భర్తబాధ అర్ధమై' పాపం ' అనుకుంది కూడానూ. ఆ ఉపాయంచెప్పిన తన స్వంత బావ

మరదుల వైపు      ఆరాధనగా చూడసాగాడు మాణిక్యరావు.




రమణి ఆ ఆఫీసులో వారం క్రితం చేరింది. చాలా అందమైనది. అలాంటి అందం అరుదుగా కనిపిస్తుంటుంది. అందుకే నిత్యం ఈసురోమంటూ నిరాశా నిస్పృహల్లో కొట్టుమిట్టాడే స్టాఫ్ ఇప్పుడు హాండ్ సమ్ గా తయారై ఠంచన్ గా ఆఫీసుకి సమయానికి వచ్చేసి బుద్ధిగా సీట్లలో కూర్చుని పనిచేసుకుంటున్నారు.

ఆమె ఏ ఒక్కర్ని సహాయం అడిగినా అందరూ ఉపకారానికి సిద్ధమై పోతున్నారు. ఎప్పుడూ ముట ముట లాడే ముఖంతో తన క్యాబిన్లో బంధీ గా వుండే బాస్ కూడా క్యాబిన్ నుండి బయటకొచ్చి అహర్నిశలూ స్టాఫ్ మధ్య ఆహ్లాదంగా గడుపుతున్నాడు. ఆ ఆఫీసులో చాలా ఏళ్ళ క్రితం నుండి లేడీ స్టాఫ్ లేరు. కారణం అక్కడి మేల్ స్టాఫ్ అంతా చిత్తకార్తె కుక్కలు. ఆడది కనిపిస్తే చాలు చొంగ కారుస్తూ లైంగిక వేదింపులు మొదలెడతారు. వాళ్ళ బాధ పడలేక అక్కడికి ఎవరూరారు..వచ్చినా ఎక్కువ కాలం వుండరు. అలాంటిది ఎడారిలో ఒయాసిస్సులా..రాక్షసుల పాలిట      అమృతభాండంలా రమణి ఆ ఆఫీసుకి వచ్చేసరికి శ్మశానానికి వసంత

కళ వచ్చినట్టుగా బావిస్తున్నారు.

"రమణీ..నిన్న నిన్నొక ఫైల్ క్లియర్ చేయమని చెప్పాను..చేశావా?" అడిగాడు బాస్.

"మూర్తిగారు నాకన్నా ఎక్స్పిరియన్స్డ్ కదండీ..ఆయన ఫాస్ట్ గా చేస్తానంటే ఇచ్చాను"

"అలాగా..నో ప్రాబ్లం..ఏయ్ మూర్తీ ఇంకో గంటలో ఆ ఫైల్ క్లియర్ చేసి నా టేబుల్ మీద పెట్టాలి..రమణీ పద నీకో లెటర్ డిక్టేట్ చేయాలి.."అని ఆమెని క్యాబిన్లోకి తీసుకెళ్ళాడు.

"మన బాస్ గొప్ప అదృష్టవంతుడ్రా! మనందరం కలిసి ఆమె అందాన్ని ఆత్రంగా కళ్ళతో నంజుకుంటుంటే..బాస్ ఆమెని క్యాబిన్లోకి తీసుకెళ్ళి ఒక్కడూ ఆ అందాన్ని జుర్రుకుంటాడు.."

"అవున్రా..ఏవన్నా ఎడ్వాన్స్ అవుతాడంటావా?"ఆయన అదృష్టానికి కృంగిపోతూ అనుమానం వ్యక్తంచేశాడు శ్రీహర్ష.

"అబ్బే..గురుడి దగ్గర అంత సీన్ లేదు.."అసూయతో అన్నాడు వీరేశ్.

"ఆమె జాయినయి వారమైంది. బందరు లడ్డులా మనమధ్య నోరూరిస్తూ తిరుగుతుంటే కళ్ళప్పగించి చూడ్డం తప్ప ఏం చేయలేక పోతున్నాము. మనం కాస్త చొరవచేసి ముందుకెళ్ళాలి."

"సర్లేరా..రాక రాక ఒకామె మన ఆఫీసుకి వచ్చింది..తొందరపడితే అసలుకే మోసం రావచ్చు. నిదానమే ప్రధానం బ్రదరూ..ఆనక మనకంతా ఆనందమే!" అన్నాడు రాజు.

"అదీ నిజమే..అయినా మన బాస్ పులిరాజు వరసలో ముందు వున్నాడు కదా.." మాట కలిపాడు మూర్తి.బాస్ క్యాబిన్లో-

"రమణీ నువ్వు వర్క్ చాలా బాగా చేస్తున్నావు..వచ్చి వారం రోజులే అయినా ఎక్స్ట్రార్డినరి పెర్ఫార్మెన్స్ తో ముందుకు దూసుకెళ్ళి పోతున్నావు. నీ మీద హెడ్ ఆఫీసుకి ఇవాళే నిన్ను అప్రిషియేట్ చేస్తూ లెటర్ రాస్తాను. నీ కరీర్ కి ప్లస్ అవుతుంది. కానీ నువ్వు జస్ట్ నాతో కాఫీకి రావాలి."

ఓహ్! ష్యూర్ సార్! నా వర్క్ ఇంత తొందర్లో మీ అప్ప్రిసియేషన్ పొందిందంటే..నా అదృష్టం..ఒక్క కాఫీ ఏం కర్మ..మీకోసం ఎక్కడికి రమ్మన్నా వస్తాను. ఏం చేయమన్నా చేస్తాను" కళ్ళు సంతోషంతో పెద్దవి చేసి ఎగ్జయిట్ అవుతూ అంది.

"అయితే ఇవాళ రాత్రి డిన్నరే!..నువ్వు సికింద్రాబాదు రైల్వే స్టేషన్ దగ్గర షార్ప్ గ సెవెనో క్లాక్ కి వుండు. నేనొచ్చి పికప్ చేసుకుంటా"అనుకున్న పని అంత తొందరగా పూర్తయినందుకు మానసికానందాన్ని పరిపూర్ణంగా అనుభవిస్తూ అన్నాడు.మరుసటిరోజు-బాస్ ఆఫీసుకొచ్చి తన క్యాబిన్లోకెళ్ళి కూర్చున్నాడు. రమణిని పిలవడం కాని మాట్లాడడం కాని చెయ్యడంలేదు. స్టాఫ్ కి విషయం అర్థం కాలేదు. అయినా తమకి హెవీ కాంపిటిషన్ తప్పినందుకు మనసులో ఆనందించారు.

"ఏంటి శ్రీహర్షగారూ..ఫైల్లూ అవీ అందిస్తూ వేళ్ళు టచ్ చేయడమేనా ఏవన్నా ప్రొసీడయేది వుందా?.."చిన్నగా అంది రమణి.అది కలా..నిజమా అనుకుని గిల్లుకున్నాడు. నిజమే! "మేడమ్..మీరు 'ఊ'అనాలే గాని తాజ్ మహల్ కట్టించలేకపోయినా..నా లెవెల్లో ఇవ్వడానికి రెడీ!"అన్నాడు మిల మిల మెరిసే కళ్ళతో!

"అయితే ఆలస్యమెందుకు ఇవాళ రాత్రికే..మనం కలుద్దాం! ఆర్ టీ సి క్రాస్ రోడ్స్ దగ్గర వెయిట్ చెయ్యండి. ఎయిటో క్లాక్ కి నేనక్కడ వుంటాను"అని చెప్పి వెళ్ళిపోయింది.

తనకి బాగా క్లోజయిన ఇద్దరి ఫ్రెండ్స్ తో తన ఆనందాన్ని షేర్ చేసుకున్నాడు. వాళ్ళు పైకి నవ్వినా లోపల కుళ్ళిపోయారు. అఫ్కోర్స్ శ్రీ కి కావలసిందదే!

మరుసటిరోజు-

శ్రీహర్ష ఆఫీసుకొచ్చి తన సీట్లో కూర్చుని పనిచేసుకుంటున్నాడు. ఎవరితో మాటాలేదూ..మంచి లేదు.

ఆ తర్వాత "మూర్తిగారూ..ఆడాళ్ళ గురించి ఆఫీసు ఖాలి సమయాల్లో..బస్టాపుల్లో..హోటల్లలో చీప్ గా మాట్లాడడమేనా? వాళ్ళని బ్లాక్ మెయిల్ చేయడమేనా? నాలాంటి దానికి దగ్గరవడానికి ట్రై చెయ్యరేం?" 'తన విషయాలు ఎలా తెలిసాయా' అని ఓ మూల ఆశ్చర్యపోయినా..తనకి ఆఫర్ ఇచ్చినందుకు మనసులో మన్మదానందం పొందుతూ "మీరు నాపై కరుణ చూపాలే కాని.. మీకేం కావాలంటే అదిస్తా..ఏం కావాలంటే అది చేస్తా!." అన్నాడు."అయితే ఇవాళ రాత్రికే..పద్మారావ్ నగర్ బస్టాప్ దగ్గర షార్ప్ గా ఎయిటో క్లాక్"అని గుస గుసగా చెప్పి వెళ్ళిపోయింది.

మరుసటిరోజు-

మూర్తి మౌనంగా ఆఫీసుకొచ్చి తనసీట్లో కూర్చుని బుద్ధిగా పనిచేసుకుంటున్నాడు.

అలాగే ఆ తర్వాత మిగతా స్టాఫ్ విషయంలోనూ జరిగింది.

ఒకరోజు-

"నన్ను ఎలా వేదించాలనుకున్నారో మీకు తెలుసు. ఆడవాళ్ళు తమ కాళ్ళమీద తాము నిలబడాలని..పొట్టపోసుకోవాలని ఉద్యోగంలో చేరుతారు. మీలాంటి కామాంధులు ఆమెని చిత్తకార్తె కుక్కల్లా వెంటాడుతూ వాళ్ళ భవిష్యత్తుని అంధకారం చేస్తున్నారు. లైంగిక వేధింపులని అరికట్టడానికి ఎన్ని చట్టాలు చేసినా ఏం ఉపయోగం? మీ చాపకింద నీరులాంటి దౌష్ట్యానికి గురై ఎవరికీ చెప్పుకోలేక..అలాఅని దిన దిన గండంగా నెట్టుకురాలేక మనసులో ఏడుస్తూ బ్రతుకీడుస్తున్నారు. అందుకే మీకా ట్రీట్మెంట్! దుష్టశిక్షణ శిష్టరక్షణ చేయడానికి దేవుడే కాదు..అబలలని రక్షించడానికి దేవతా పూనుకుంటుంది.కనకదుర్గావతరమెత్తుతుంది. మదోన్మత్తుల మదమణస్తుంది. ఇవాల్టితో దసరా నవరాత్రులు ముగిశాయి. నా అవతార పరిసమాప్తి అయింది. మగాళ్ళందరికీ ఇదే నా హెచ్చరికగా చెప్పండి..మీలో మార్పు రాకపోతే వచ్చే సంవత్సరం మళ్ళీవస్తా..తాటతీస్తా"అని అంతర్ధానమయింది.

విచిత్రమేమిటంటేలైంగిక వేధింపులు జరిగే ప్రతిచోట అలాగే జరిగింది. ఒక్కోచోట ఒక్కో రమణిఅవతారం. ఏంచేసిందో..ఎలా చేసిందో కాని..అది బయటకు పొక్కలేదు కాబట్టి మీడియాలో చోటుచేసుకోలేదు. అసలు జరిగిందేమిటంటే..ఏ మగతనాన్ని చూసుకుని వాళ్ళు రెచ్చిపోయారో..అదే లేకుండా చేసిందని వాళ్ళకి మాత్రమే తెలుసు. సంసార సుఖానికి.. దూరమై జీవితకాల శిక్ష అనుభవిస్తున్నారు. కుత్తుకలు తెగ్గోయడం కన్నా అదే మగాళ్ళకి కఠినమైన శిక్ష!

ఇప్పుడు ఆడవాళ్ళు స్వేచ్ఛగా సంతోషంగా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. మగాళ్ళతో సమానంగా పరుగులుపెడుతున్నారు.




“సూర్యం..” అంటూ పిలిచింది మూడవ తరగతి క్లాసు టీచర్ ఝాన్సీ.

“వేలిముద్ర..! వేలిముద్ర..!!’ అని ఒక్క సారిగా అరిచారు క్లాసులోని పిల్లలంతా.

తమ ఎడం చేతి బొటన వేళ్లను నృత్యసుందరిలా ఆడిస్తూ గేళి చేయ సాగారు.

“సైలెన్స్..! సైలెన్స్..!!” అంటూ డస్టర్‌ను టేబుల్‌పై కొట్టింది ఝాన్సీ.

క్లాసురూంలో కాస్తా నిశ్శబ్దం చోటుచేసుకుందే కాని పిల్లల ముసి ముసి నవ్వులతాలూకు ఆనవాళ్ళు కనబడుతూనే ఉన్నాయి. తన క్లాసులో ఇలా జరగటం ఇదే ప్రథమం. ఓపిక వహించింది.

సూర్యం లేచి తడబడుతూ టీచర్ వద్దకు వెళ్ళాడు. ఝాన్సీ టీచర్ ప్రోగ్రెస్ కార్డు అందించింది. దాన్ని తీసుకుంటూ ఉండగా సూర్యం కళ్ళలో నుండి రెండు కన్నీటి చుక్కలు జల, జలా కారుతూ ప్రోగ్రెస్ రిపోర్టు మీద పడ్డాయి.

ఝాన్సీ చలించిపోయింది. అనుకోకుండా తన కళ్ళూ చెమర్చాయి.

చటుక్కున వంగి సూర్యాన్ని తన గుండెలకు హత్తుకొంది.

ఈ హఠాత్పరిణామానికి క్లాసంతా సద్దుమణిగింది. పిల్లలంతా భయం భయంగా టీచర్ వంక చూడ సాగారు.

సూర్యాన్ని నెమ్మదిగా తీసుకు వెళ్ళి అతడి సీట్లో కూర్చోబెట్టింది ఝాన్సీ. తన చేతి రుమాలుతో కన్నీళ్ళు తుడ్చింది. ప్రోగ్రెస్ కార్డు తన బ్యాగులో పెట్టు కున్నాడు సూర్యం.

గొంతు పూడుకు పోయి వెంటనే ఏమీ మాట్లాడలేక పోయింది ఝాన్సీ.

రెండు క్షణాలు క్లాసంతా కలియ జూసి గొంతు సవరించుకుంది.

ఒక్కొక్క పేరు పిలుచుకుంటూ మిగిలిన ప్రోగ్రెస్ కార్డ్స్ పంచటం పూర్తికాగానే పిల్లల మనసుల్లో పేరుకుపోయిన భయం పోగొట్టాలనే నెపంతో సూర్యం గమనించకుండా పెదవి దాటని చిరునవ్వు ప్రదర్శించింది.

"నేనూ మీలాగే ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను" అంటూ ఝాన్సీ మాట్లాడటం మొదలు పెట్టగానే పిల్లలంతా తృప్తిగా

శ్వాసించడం ఆమెకు కాస్తా సాంత్వన చేకూరింది. సూర్యం కూడా కుతూహలంగా వింటున్నాడని గమనించింది.

"నేను పదవ తరగతి చదువుతుండగా నాకు మెరిట్ స్కాలర్షిప్ వచ్చింది. తొమ్మిదవ తరగతిలో నాకు మా పాఠశాలలో ఫస్ట్ ర్యాంక్ వచ్చినందుకు గాను సోషల్ వెల్ఫేర్ డిపార్ మెంట్ వాళ్లు నాకు నూటాఇరువై రూపాయలు పంపించారు. అంత మొత్తం డబ్బు ఆ కాలంలో నేనూహించనిది. అది మానాన్నగారి ఒక నెల జీతంతో సమానం. నా సంతోషానికి అవధులు లేవు. దానిని తీసుకోవాలంటే తల్లి గాని తండ్రిగాని ఎవరో ఒకరు వచ్చి రిజిస్టర్లో సంతకం పెట్టాలి. డబ్బు పిల్లల చేతికి ఇవ్వరు.

మా నాన్నకు సంతకం పెట్టడం వచ్చు.. కాసింత అక్షర జ్ఞానం కూడా ఉంది. మా అమ్మకైతే చదువు రాదు. సంతకం అసలే రాదు.. వేలిముద్ర.." అంటూ ఒకసారి సూర్యం వంక చూసింది. సూర్యం మోములో ఎలాంటి స్పందనా కనపడలేదు. మళ్ళీ చెప్పటం ఆరంభించింది ఝాన్సీ.

"చైనా మన దేశం మీద దురాక్రమణ జరిపిన సమయమది. మా నాన్న సైనికుడు. యుద్ధభూమిలో ఉన్నాడు. నాన్న వచ్చే పరిస్థితి లేదు" అంటూ చైనా యుద్ధం గొరించి కాసేపు వివరించింది. పిల్లలు ఆసక్తిగా వినసాగారు.

"ఇక అమ్మ వచ్చి డబ్బు తీసుకోవాల్సిందే.. కాని అప్పుడు ఆడవారు ఆఫీసుకు రావడం అరుదు.. పైగా వచ్చి వేలిముద్ర వేస్తే నాక్లాస్మేట్స్ అంతా మీలాగే హేళన చేస్తారనే భయం. గడువు ఇంకా పది రోజులే వుంది. ఆ లోగా డబ్బు తీసుకోకుంటే అది తిరిగి వెళ్ళిపోతుందని మా హెడ్మాస్టర్ నన్ను హెచ్చరించారు" అంటూ క్లాసంతా మరో మారు కలియ జూసింది ఝాన్సీ. అందరిలో ఉత్కంఠ.. సూర్యం కూడా ఉత్సాహంగా వింటూ ఉండటం ఝాన్సీ తృప్తిపడింది.

"నేను మా అమ్మకు సంతకం నేర్పించాలని నిర్ణయించుకున్నాను. మా అమ్మ వాకిట్లో చక్కని ముగ్గులు వేసేది. ఆ ముగ్గులు వేయటం నాకు కష్టమయ్యేది. అదే విషయం మా అమ్మతో అన్నాను. ముగ్గుల కంటే అక్షరాలు నేర్చుకోవటం చాలా తేలిక అని వివరించాను. ముగ్గుల మెలికలలో అంతర్గత అక్షరాల చూపిస్తూ మెళకువలు నేర్పాను. నాల్గు రోజుల్లో అమ్మ సంతకం చేయటం నేర్చుకుంది. నాకు చాలా సంతోషమేసింది. అమ్మను మా బడికి తీసుకు వెళ్ళాను. మా అమ్మ తన పేరుతో సంతకం పెట్టడం చూసి హెడ్మాస్టర్ నన్ను ఎంతగానో మెచ్చుకున్నాడు" అని చెబుతుండగా.. పాఠశాల ఆఫీసు అసిస్టెంట్ నోటీసు రిజిస్టర్ తీసుకొని వచ్చి అంతరాయం కలిగించాడు.

ఝాన్సీ చదివి వినిపించింది. మరుసటి రోజునుండి 'దసరా' పండుగ పది రోజుల సెలవుల ప్రకటన అది. తిరిగి పాఠశాల ప్రారంభం రోజున ప్రోగ్రెస్ రిపోర్ట్స్ తీసుకురండని అంటూండగా బడి గంట మ్రోగింది.

సెలవుల అనంతరం పాఠశాల తిరిగి ఆరంభమయ్యింది.

ఝాన్సీ టీచర్ అంటే హెడ్మాస్టర్‌కు మిగతా స్టాఫ్ మెంబర్స్ కు ఎనలేని గౌరవం. ఆమె విద్యార్థులందరికీ మాతృమూర్తి. ఆమె వచ్చినప్పటి నుండి పాఠశాల తీరుతెన్నులే మారిపోయాయి. తాను విద్యాబోధనలోనే గాకుండా కళారాధనలో దిట్ట. తరగతి గదులన్నీ సూక్తులతో తీర్చి దిద్దింది. అదనపు సమయం వెచ్చించి విద్యార్థుల సహాయంతో పాఠశాలను పచ్చదనంగా మార్చింది. ఆట పాటలలో పిల్లలు అందె వేసిన చేయి.. అంటే దాని వెనకాల ఝాన్సీ శ్రమ దాగి ఉన్నట్లే. ఆమె బడిలో అడుగు పెట్టినప్పటి నుండి విద్యార్థుల సంఖ్య అనూహ్యంగా పెరగటం... ఒక ప్రభుత్వ పాఠశాల అలా క్రమశిక్షణగా నడవటం.. ఆ గ్రామ ప్రజలు గర్వంగా ఝాన్సీ పేరే చెప్పుకుంటూ వుంటారు. ఝాన్సీ టీచర్ సమయానుసారం యథావిధిగా మూడవ తరగతికి వెళ్లింది.

ఆమె క్లాసంటే పిల్లలు చెవి కోసుకుంటారు. ఝాన్సీ టీచర్ పాఠాలతో బాటుగా ప్రాపంచిక జ్ఞానం నేర్పిస్తుంది. ఏ రోజు ఏ కొత్త విషయం చెబుతుందో అని పిల్లలు ఆసక్తిగా తరగతులు హాజరవుతూ వుంటారు.

విద్యార్థులంతా తమ తమ ప్రోగ్రెస్ కార్డ్స్ తిరిగి ఇవ్వ సాగారు.

సూర్యం క్లాసులో ఫస్ట్ ర్యాంకు స్టూడెంట్. చిన్నప్పుడే తండ్రిని కోల్పోయాడు. తల్లి వ్యవసాయ కూలి. ఆమెకు చదువుకోలేదు. కాని కొడుకును ఎంతో కష్టపడి చదివిస్తోంది.

సూర్యం చివరగా తన ప్రోగ్రెస్ కార్డ్ టీచర్ చేతికందించాడు..

విద్యార్థులంతా తమ తమ బొటన వేళ్ళను ఆడిస్తూ వుండటం గమనించింది..

తన ప్రయత్నం ఫలించిందా అనే కుతూహలంతో ఝాన్సీ కార్డ్ తెరచి చూసింది. అమితానందంతో కళ్ళు విచ్చుకున్నాయి.. ఇది నిజమేనా? అన్నట్లుగా అలాగే సూర్యం వంక చూసింది. సూర్యం కళ్ళల్లో వెలుగు.. మోములో ఆనందం వెల్లివిరియడంతో సూర్యాన్ని అభినందించ సాగింది .

పిల్లలకు ఏమీ అర్థం గాక బిక్క మొహాలు వేసి చూడసాగారు..

"వేలిముద్ర కాదు.. సూర్యం అమ్మగారి తొలి సంతకం.." అంటూ సూర్యం ప్రోగ్రెస్ కార్డ్ పిల్లలకు చూపించింది.

సూర్యం తల ఎత్తుకొని క్లాసు వంక గర్వంగా చూడసాగాడు.

సూర్యం ప్రోగ్రెస్ కార్డులో వేలిముద్ర బదులు సంతకం కనబడేసరికి కొందరు పిల్లలు 'ఏం మాయ చేసాడో..!' అన్నట్లుగా చూస్తూ వుండటం గమనించింది ఝాన్సీ.

ఝాన్సీకి ఆ అనుమానమే లేదు. కాని పిల్లలందరికి వాస్తవాలు తేటతెల్లం కావాలి అనుకుంది.

"సూర్యం.. నిజంగా నువ్వు మీ అమ్మ గారికి సంతకం చేయటం నేర్పావా? లేక నువ్వే మీ అమ్మగారి సంతకం పెట్టావా?" అంటూ నిలదీస్తున్నట్లుగా అదిగింది.

"ప్రామిస్ టీచర్.. మా అమ్మే సంతకం పెట్టింది.." అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

టీచర్ ఓదార్చింది..

"సూర్యం..! ఏడ్పు సమాధానం కాదు కన్నా... ఇన్నాళ్ళుగా మీ అమ్మగారు ప్రోగ్రెస్ కార్డు మీద వేలి ముద్ర వేసేది కదా.. ఇప్పుడు సంతకం ఎలా పెట్టింది?.. నిజం చెప్పు" అంటూ సూర్యం నుండి నిజం పిల్లలందరికి తెలియాలి అన్నట్లుగా అడిగింది.

"ఆవాళ నేను ఇంటికి ఎళ్ళాక మాయమ్మతో సంతకం చేయటం నేర్చుకొమ్మని అడిగా.. నాకు రాదురా అంది. నేను అన్నం తినకుండా అలిగి పడుకున్నా. అన్నం తినమని ఎంతగానో బతిమాలింది. సంతకం చేయటం నేర్చుకుంటేనే తింటానని

మొండికేశా.. అమ్మ ఒప్పుకుంది” అంటూ సూర్యం కళ్ళు గుండ్రంగా తిప్పుకుంటూ చెప్ప సాగాడు. పిల్లలంతా ఊపిరి బిగబట్టి వినసాగారు.

“అమ్మ మూడు రోజుల్లో సంతకం నేర్చుకుంది. ఇప్పుడు తెలుగు అక్షరాలన్నీ గుర్తిస్తోంది..” అంటుంటే ఝాన్సీ టీచర్ కరతాళ ధ్వనులు చేయటం ప్రారంభించింది. పిల్లలంతా ఆమెను అనుకరించారు. సూర్యం పొంగి పోయాడు.

“మీ తల్లిదండ్రులందరికీ చదువు వస్తుందో లేదో నాకు తెలియదు. చూశారా..! సూర్యం పట్టుదల.. తాను చదువుకుంటూ తన తల్లి గారికీ చదువు నేర్పిస్తున్నాడు. మీరు ఇంకో విషయం తెలుసుకోవాలి..” అనగానే పిల్లల్లో ఉద్వేగం పెరిగింది.

“వేలిముద్ర అని మీరు ఎగతాళి చేయకూడదు. సంతకాన్ని ఫోర్జరీ చేయవచ్చునేమో గాని వేలిముద్రని ఫోర్జరీ చేయలేము.. ఏ ఇద్దరి వేలిముద్రలు ఒకేలా ఉండవు.. తెలుసా..” అంటూ వేలిముద్ర యొక్క ప్రాశస్త్యాన్ని, ప్రాముఖ్యతనూ వివరించింది. పిల్లలంతా ఆశ్చర్యంగా వినసాగారు.

“ప్రతీ మనిషికి చదువు ఎనలేని సంపద. ‘ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు’.. మన భారతమాత ఎంతగానో సంతోషిస్తుంది..” అంటూ వుండగా బడి గంట మ్రోగింది.

ఝాన్సీ టీచర్ క్లాసు నుండి బయటికి వెళ్తూ సూర్యాన్ని పిల్లలంతా అబినందిస్తుండటం గమనించింది. ఒక ఉపాధ్యాయురాలిగా తన బాధ్యత మరింత పెరిగిందని మనసు గుర్తు చేస్తోంది.




"అమ్మా... అమ్మ్మా..." అంటూ హడావిడిగా వచ్చింది భవ్య." ఏంటమ్మా ఏమైంది ఎందుకంత తొందరా అంటూ వారించింది హేమ. అది కాదమ్మా రచనకు ఆక్సిడెంటు అయిందట నేను వెళుతున్నా ఇప్పుడే ఫోనొచ్చింది. అంటూ హడావిడిగా బయటకు పరుగు తీసింది భవ్య. అలా వెళ్ళడం, భార్య కొయ్యబారిపోవడం చూసి ఆనంద్ గారు పరుగున వచ్చారు. భార్యను సుతారంగా పైకి లేపి "ఏమయ్యింది హేమ? భవ్య అలా టెన్షన్ పడుతూ వెళుతుంది" అని అడిగాడు. షాక్ లోంచి బయటకు వచ్చిన హేమ రచనకు ఆక్సిడెంటూ అయిందటండీ అందుకే వెళ్ళింది" అని చెప్పి లోపలికి వెళ్ళింది. రచనకు ఆక్సిడెంటు కావడమేమిటీ? అలా వెళ్ళడమేమిటీ? అది చూసి భార్య హేమ షాక్ కు గురవ్వడమేంటోతెలియక మొహం వేళాడేసుకుని చూస్తూ వుండిపోయాడు ఆనంద్.

లోపలికి వెళ్ళిన హేమకి ఏమీ తోచడం లేదు, భర్త నుంచి తప్పించుకుంది కానీ మనసులో వున్న అనుమానాలను తెంచుకోలేక పోయింది. రచన మధ్య తరగతి అమ్మాయి వాళ్ళ కంటే కాస్త వున్నంతలో మంచి కుటుంబం హేమ వాళ్ళది., తాము మధ్య తరగతి నుండి పైకొచ్చిన వాళ్ళమే అయినా ఆ రోజు రచన అడిగిన వెంటనే డబ్బులు ఇవ్వగలిగింది హేమ అదీ భర్తకీ, కూతురికీ తెలియకుండా...        తను డబ్బులు ఇచ్చిన పది రోజులకు ఇప్పుడు ఈ ఆక్సిడెంటు అవ్వడమేమితి? ఏమిటో తనకేమిటీ అర్థం

కావడంలేదు. అసలు రచన తన దగ్గర డబ్బు తీసుకుంది అనడానికి తన దగ్గర ఏ ఆధారం లేదు ఏదో చే బదులుగా అడిగింది తను ఇచ్చింది అని గతాన్ని గుర్తుచేసుకుంటున్న హేమ ఏదో ఆలోచన వచ్చిన్ దానిలా టక్కున ఆగింది. అవును ఇప్పుడు రచన తనను మోసం చేయదు కదా? తను ఏదో ఆపదలో వుందని ఇచ్చింది కానీ ఇప్పుడు ఈ ఆక్సిడెంటు మూలంగా రచనకు జరగరానిది ఏమన్నా జరిగితే తన డబ్బు తనకు రాదు, భర్త అడిగితే ఏం జవాబు చెప్తుంది? అసలే అవి ఏమైన అత్యవసర పనులకు అవసరమవుతాయని భర్త దాచమని ఇచ్చిన డబ్బులు... అసలు రచనకు నిజంగానే ఆక్సిడెంటు అయ్యిందా? లేక కేవలం తన డబ్బులు ఎగవేయడానికి తనే ఇలా ఆక్సిడెంటు విషయం తనకు తెలిసేలా చేసిందా? ఒక వేళ తాను ఇప్పుడు వెళ్ళి డబ్బులు అడిగితే నకెప్పుడిచ్చావ్ అంటుందా? ఏమో కానీ... ఇప్పుడు ఆలోచిస్తుంటె తనకు అలా డబ్బులు ఇవ్వడం తప్పనిపిస్తోంది. భగవంతుడా రచనకు ఏమీ కాకూడదు. నా డబ్బులు నాకు ఎలాగైనా రావాలి అని వేయి దేవుళ్ళకు మొక్కుకుంది మనసులో. సాయంత్రం అయ్యింది భర్తకి కాఫీ ఇచ్చి తాను ఏదో అయ్యింది అనిపించింది.

భవ్య రాక కోసం ఎదురుచూస్తూ కూర్చుంది. అక్కడికి రెండు సార్లు ఫోన్ చేసింది కానీ స్విచ్చాఫ్ వస్తుంది. ఏమైందో తెలియక జుటు పీక్కోవాల్సింది కానీ ఆనంద్ వున్నాడని ఆగిపోయింది. అలా ఓరెండు గంటలు గడిచాక భవ్య వచ్చింది, హమ్మయ్య అనుకుంటూ ఏమైందమ్మా ఇప్పుడు నీ ఫ్రెండ్ రచనకి ఎలా వుంది అని అడిగింది ఆత్రం గా , ఎప్పుడు ఎవరి గురించి ఇంతగా అడగని తల్లిని చూసి ఆశ్చర్యపోయింది భవ్య మళ్ళీ తేరుకుని బాగానే వుందమ్మా, రెండు రోజుల తరువాత డిశ్చార్జ్ చేస్తారట అని చెప్పి ఫ్రెష్ అవడానికి తన గదిలోకి వెళ్ళింది. భగవాన్ నా మనసు అర్ధం చేసుకున్నావు అని మనసులోనే దేవునికి దండం పెట్టుకుంది హేమ. అయినా కానీ తన మనసు పీకులోంది నిజం గా తను ఇచ్చిన డబ్బులు రచన తిరిగిస్తుందా? లేదా తనని మోసం చేస్తుందా? అని ఆలోచిస్తూ ఎటూ తేల్చుకోలేకపోయింది.

భవ్య, ఆనంద్ రావు ఎవరి ఆఫీసులకు వాళ్ళు వెళ్ళారు. వాషింగ్ మెషిన్ లో బట్టలు వేసి లోపలికి వెళ్ళబోతున్నదల్లా గేటు చప్పుడవడంతో ఎవరూ అని అటువైపు చూసింది హేమ. అలా చూస్తూనే ఆశ్చర్యపోయింది. కారణం రచన వస్తుంది... తలకి చేతులకి కట్లతో తను అలానే చూస్తూ వున్నా తనని చూస్తూ నవ్వుతూ దగ్గరికొచ్చి చాలా థ్యాంక్స్ ఆంటీ అడగగానే సహాయం చేసారు మీ మేలు ఎప్పటికీ మర్చిపోలేను, ఆ రోజు మీకు డబ్బు ఇద్దామని వస్తుంటేనే నాకు ఆక్సిడెంట్ అయ్యింది, మీకు తెలుసో లేదో కొద్దిలో పెద్ద ప్రమాదం తప్పింది అని గడ గడా చెప్తూ ఇంకా షాక్ లో వున్న హేమని చూస్తూ ఏమయ్యింది ఆంటీ అలా వున్నారు అని అడిగింది. హేమ ఏమీ మాట్లాడకుండా అలానే వుండిపోయేసరికి రచన ఆంటీ... ఆంటీ ఆ ని పిలిచేసరికి ఒక్కసారిగా ఈ లోకం లోకి వచ్చింది హేమ. రచన ఏమయ్యింది ఆంటీ అలా వున్నారు? అని అడిగింది హేమ ఏమీ లేదమ్మా చెప్పు ఇప్పుడెలా వుంది నీకు ? అని అడిగింది హేమ, డబ్బు విషయం ఎలా అడగాలో అర్ధం కాక కొంచెం మంచి నీళ్ళు ఇవ్వడాంటీ దాహం గా వుంది వుంది అని రచన అడిగేసరికి హేమ లోపలికి వెళ్ళి నీళ్ళు తీసుకొచ్చి ఇచ్చింది. రచన ఆ నీళ్ళు తాగి కొంచెం రిలాక్స్ అయ్యి మీకు తెలియదు ఆంటీ ఆ రోజు డబ్బు కట్టకుంటే నా జాబ్ పోయేది చాలా మందిని అడిగా కానీ ఎవరూ సహాయం చేయలేదు, మీరు చేసారు, మీరు చేసిన ఆ సహాయం తో నాకు ఆ జాబ్ రాగలిగింది. ఇదిగోండి ఆంటీ ఆ డబ్బులు తీసుకోండీ అంటూ ఓ కవర్ ని ఇచ్చింది. యధాలాపం గా వింటున్న హేమ ఉలిక్కిపడింది ఆ కవర్ ని తీసుకుంటూ తానెంత తప్పు చేసింది సాటి మనిషిని ఎంత తప్పుగా అర్ధం చేసుకుంటే కేవలం తన డబ్బులు తిరిగిరావాలని ఎలా దేవునికి మొక్కుకుంది. అసలు తన కూతురు వయసున్న రచనని ఎలా తను అనుమానించింది., రచన మోసం చేస్తుంది అని ఎలా అనుకుంది?? ఇవన్నీ

ఆలోచిస్తుంటే హేమకి తను చాలా తప్పుగా ఆలోచించాను అనిపించింది.

రచన ముందు తాను ఎంతో చిన్నదానిలా కనిపించింది ఇంత వయసు అనుభవం వుండి కూడా ఇంకా ఒక మనిషిని నమ్మలేకపోయిన తన వ్యక్తిత్వాన్ని పిచ్చి మనసుని చూస్తుంటే తనకు తాను ఇంకా ఎలాంటి పరిస్థితిలో వుందో అర్ధం అవుతుంది. ఇలా ఆలోచనల్లో వున్న హేమ ఆంటీ...ఆంటీ.. అన్న భవ్య పిలుపుకు ఈ లోకం లోకి వచ్చింది. ఏమయ్యిందాంటీ అంతలా ఆలోచిస్తున్నారు? అని అడిగింది రచన ఏమీ లేదమ్మా ని కెంత ప్రమాదం తప్పింది అని ఆలోచిస్తున్నాను అంది హేమ. రచన నవ్వి ఏదోలే ఆంటీ ముందు మీ డబ్బులు మీకు ఇచ్చేసినందుకు నాకు చాలా హ్యాపీ గా వుంది అని నవ్వుతూ అంటున్న రచన ముందు తాను అల్పురాలిలా అనిపించినా అయినా... ఒకందుకు మంచే జరిగింది, ఈ సంఘటన వలన తనకు డబ్బు విలువ, ఇతరుల విలువ తెలిసొచ్చింది అని అన్నుకుంటూ తాను రచనలో జతగా నవ్వు కలిపింది హేమ.




సెల్ ఫోన్ లో మ్రోగిన అలారం తో నిద్రలేచిన నీహారిక తన దినచర్య ప్రారంభించింది. పది నిముషాల్లో కాలకృత్యాలు ముగించుకుని ఆపై ఇరవై నిముషాలు ప్రశాంత వాతావరణంలో మెడిటేషన్... ఆ తరువాత గంటపాటు యోగా చేసింది. స్నానం కానిచ్చి మొక్కుబడిగా దేవుడికి ఓ దణ్ణం పెట్టుకుని వెంటనే తన కిష్టమైన లాప్ టాప్ తెరచి తన లోకమైన ఫేస్ బుక్ లోదూరి రాత్రి పడుకునే

ముందే లాగ్ అవుట్ చేసిన అకౌంట్ ఓపెన్ చేసి స్టేటస్ అప్డేట్ చేసే కార్యక్రమంలో మునిగిపోయింది. ఈ మధ్య అంటే గత రెండు మూడేళ్ళుగా ఇదే ఆమె నిత్య కృత్యం, కొండంత ఆస్తి, ప్రేమించే భర్తా, ఇంట్లో పనంతా పూర్తిచేసే నమ్మకమయిన పనివాళ్ళు... అంతే కాకుండా ఇద్దరు పిల్లలు అరుణ్, భవ్య... సెకండ్ క్లాస్ నుంచే హాస్టల్ లో వుండి చదువుకుంటున్నందున సెలవుల్లో తప్ప ఇంటికి రారు... తల్లిని ఆమె ఫేస్ బుక్ ప్రపంచం లోంచి బయటకు వచ్చేలా చేయరు.

ఏ విషయాల్నీ ఆమె బాధ్యతగా... సీరియస్ గా తీసుకోదు... అలాగే బాధపడే విషయాలు... బాధ్యతలు ఆమె దరిచేరవు. ఇంటి పనులన్నీ బాధ్యతగా చేసే దూరపు బంధువైన శాంతమ్మ ఇచ్చిన టిఫిన్ ప్లేట్ అందుకుని... అవినాష్ బయటకు ఎప్పుడు వెళ్ళాడు అని అడిగింది నీహారిక. అదేమిటమ్మా.. రాత్రి కూడా బాబు ఇంటికే రాలేదుగా అన్న శాంతమ్మతో... యస్...యస్... మర్చిపోయాను అనుకుంటూ అక్కడి నుంచి తన రూం కి వెళ్ళిపోయింది, చేసేదేం లేక ఫ్చ్ ..అని నిట్టూర్చి తన పని తను చేసుకోసాగింది శాంతమ్మ.

భర్తనలా పేరు పెట్టి పిలవకూడదనీ... భర్తతో అన్యోన్యం గా వుండటం ఇల్లు చక్కబెట్టుకోవడం తన కర్తవ్యమనీ చెప్పాలని వున్నా పెదవి విప్పి చెప్పలేదు శాంతమ్మ... ఎందుకంటే నీహారిక నోటి దురుసు సంగతి ఆమెకు తెలుసు. తన పరిస్థితి బాగోలేక వాళ్ళింట్లో వుండి రోజులు వెళ్ళదీస్తున్న తను.. నీహారిక కోపానికి గురై వున్న ఈ కాస్త నీడ పోగొట్టుకోవటం తనకిష్టం లేదు.

తన రూం లోకి వెళ్ళి టిఫిన్ పూర్తి చేసిన నీహారిక యధావిధిగా మళ్ళీ మధ్యాహ్నం భోజనం సమయం వరకూ నెట్ ఓపెన్ చేసి దేశం లోని ఇతర రాష్ట్రాల్లోని స్నేహితులతోనూ అలాగే వేరే దేశాల్లో వున్న తన బంధుమిత్రులందరితోనూ చాటింగ్ చేస్తూ రోజులు గడిపేస్తుంది. అది తన హాబీ..

టీవీ చూడటం.. భర్తతో కల్సి సినిమాకి కానీ... పార్క్ కి కానీ.. వెళ్ళటం అంటే ఆమెకు ఎలర్జీ.. పిల్లలతో.. భర్తతో కలిసి టూర్ కి వెళ్ళాలన్న ఆమె దృష్టిలో టైం వేస్ట్ ఎవరితోనూ పరిచయాలు చేసుకోదు... ఎవర్నీ ఇంటికి రానియ్యదు... ఎంతసేపూ ఆ ఫేస్ బుక్ లో ఎవరెవరో పంపే మెసేజ్ లకు లైకులు కొట్టుంటూ క్రొత్త క్రొత్త స్నేహాలు పెంచుకుంటూ.... వాళ్ళు పంపే ప్రతీ ఫోటోలను షేర్ చేసుకుని అద్భుతం గా వున్నాయంటూ కామెంట్లు పెట్టడమూ తప్ప తనకంటూ చేయడానికి కానీ... ఆలోచించడానికి కానీ ఏ పనీ పెట్టుకోదు.

దూర ప్రాంతాల్లోని స్నేహితులతో అమెరికా, లండన్ లో వుంటున్న బంధువులతో రోజూ చాటింగ్ చేస్తున్నా... రోజుకి ఇరవై నాలుగంటలు కాకుండా ముప్పై గంటలయితే బాగుండు అని.. అనుకుంటూ వుంటుంది.

సిటీలోని, వేర్వేరు ప్రాంతాల్లో రెండు ప్రాంతాల్లో రెండు ఖరీదయిన భగవంతులున్నా పోష్ ఏరియాలోని స్వర్ణ అపార్ట్ మెంట్ లో వుంటున్నారు. నీహారిక భర్త అందగాడు. తెలివైన వాడు. అన్ని విషయాల్లో బాధ్యత కలవాడు. అతడికి భార్య అంటే ప్రాణం. అవినాష్ తన తల్లితండ్రులకు ఒక్కటే సంతానం కావడంతో అమ్మానాన్నలను తనతో పాటు వుంచుకోవాలనీ... అలాగే హాస్టల్ లో వుంటున్న పిల్లల్ని ఇంటికి తీసుకువచ్చి వారి ఆలనా పాలనా చూసుకుంటూ చక్కగా చదివించి, పెంచి పెద్ద చేయాలని అతనికెంతో ఇష్టం. కానీ దానికి ససేమిరా ఒప్పుకోదు నీహారిక.... ఎందుకంటే... వీళ్ళంతా ఇంట్లోనే వుంటే తను ఎంతో కొంత బ్ధ్యతగా వుండాల్సివస్తుంది.. అది తన వల్ల కాని పని, అందుకే తననెంతో ఆరాధించే భర్తని ఎన్నడూ తన మాట జవదాటనీయకుండా అదుపులో వుంచుకుంది. ఆమెకు ఎట్టి పరిస్థితి లోనూ ఎదురు చెప్పడు. ఆమెకు ఇష్టం లేని పని చేయడు.

ఎం. బి. ఏ చేసిన నీహారికను పెళ్ళయిన కొత్తలోనే కంపెనీ పనుల్లో భాగస్వామిగా సాయమందించమని మురిపెం గా అడిగినా తోసిపుచ్చిన భార్య మారదని ఆమెను పట్టించుకోవడం మానివేసి కంపెనీ వ్యవహారాల్లో బిజీ అయిపోయాడు.

ఇద్దరు పిల్లలు పుట్టాక వారిద్దరిమధ్య మానసికం గా చాలా దూరం పెరిగింది, భార్య ఎంతసేపూ... స్నేహాలూ... చాటింగ్ అంటూ లోకంలో తనుండటంతో, అవినాష్ కూడా తన సమయాన్నంతా కంపెనీ విస్తరించడానికి వెచ్చించి వేరే దేశాల్లో కూడా బ్రాంచిలు ఏర్పరిరిచి బిజీ బిజినెస్ మాన్ అయిపోయాడు.

కోట్లకు వారసుడైన కొడుకు మనశ్శాంతి కరువై దేశాలు పట్టుకు తిరగడం చూసి బాధపడటం మినహా ఏం చేయలేని దుస్థితి అవినాష్ తల్లితండ్రులది.

రాత్రి ఆలస్యం గా ఇంటికి చేరిన అవినాష్ భార్యని పిలిచి అమెరికాలో కంపెనీ వ్యవహారాలకు సంబంధించి ఫారిన్ డెరిగేట్స్ తో ముఖ్యమయిన మీటింగ్ వుందనీ.. వారం రోజుల దాకా ఇండియా రాననీ అంతే కాక ఈ వారం రోజులూ తన ఫోన్ స్విచ్చాఫ్ చేసే వుంటుందనీ చెప్పి వెంటనే నిద్రకుపక్రమించాడు. అది ఆమెకు బాధ కల్గించే విషయమైతే కాదు.. ఎవరున్నా లేకున్నా తన ప్రపంచం తనది.

అవినాష్ అమెరికా వెళ్ళి నాలుగు రోజులు గడిచాయి. ఆ తరువాత రోజు చెన్నై లో వుంటున్న ఆమె ఫ్రెండ్ ఊటి ఫ్యామిలీ తో సహా వెళ్ళి అక్కడి ఫోటోస్ ఫేస్బుక్ లో పోస్ట్ చేసింది... నిజం గా ఆ లొకేషన్స్ చాలా బాగున్నాయి. అవి చూసి తను కూడా ఎక్కడికైనా వెళ్ళి ఫోటోస్ పంపాలని నిర్ణయించుకుని సాయంత్రం నాలుగు గంటలకు డ్రైవర్ లేకుండా ఒంటరిగా కారులో వాటర్ ఫాల్స్ వుండే పిక్నిక్ స్పాట్ కి బయల్దేరింది. ఊరికి చాలా దూరం గా వుండటం తో అక్కడికి చేరుకోవాడానికి గంటన్నర పట్టింది. ఆ రోజు వీకెండ్ కావటంతో జనాలు ఎక్కువగా వున్నారు. అక్కడ వున్న వాళ్ళంతా ఆనందం తో సంతోషం తో కేరింతలు కొడుతూ ప్రతీవాళ్ళూ చిన్న పిల్లల్లా సంబరపడుతున్నారు.

అక్కడ నీహారిక ఒక విషయం గమనించి తనలాగా ఒంటరిగా మాత్రం అక్కడెవరూ లేరు.. ఎందుకో చాలా నిస్పృహగా అనిపించింది. నీళ్ళల్లో ఈతలు కొడ్తున్న పిల్లల్ని చూస్తూ గట్టున వున్న తల్లితండ్రులు వాళ్ళనలా చూస్తూ ఆనందిస్తున్నారు. ఎటు చూసినా .. ఎవర్నీ చూసినా ప్రతీ ఒక్కరి లో ఆనందం తాండవం చేస్తుంది. అందరూ ఎంతో ఎంజాయ్ చేస్తున్నరు. ఆ ప్రదేశం లో వున్న వాటర్ ఫాల్స్.. అక్కడి లోకేషన్స్ అన్నీ చూసి తను కూడా ఆనందం గానే వుంది. కానీ ఆ ఆనందాన్ని షేర్ చేసుకోవడానికి ప్రక్కన అవినాష్ ..పిల్లలూ లేరు... ఒక్క క్షణం చాలా గిల్టీ గా ఫీలయ్యింది, యిన్నాళ్ళు భర్తని.. పిల్లల్నీ తనెంతో మిస్ అవ్వటమే కాకుండా... పిల్లల చిన్న చిన్న సరదాలను కూడా తీర్చుకోనివ్వకుండా వాళ్ళ సంతోషాన్ని మిస్ చేసానని గ్రహించింది.

వెంట ఎవరూ లేని కారణం గా అక్కడ లొకేషన్ లో ఫోతో దిగడానికి కూడా వేరే వాళ్ళను డిస్టేబ్ చేసి రిక్వెస్ట్ చేయాల్సి వచ్చిమ్నందుకు చాలా బాధపడింది.ఇక ఎక్కువ్ సేపు అక్కడ వుండబుద్ధికాక పార్క్ చేసిన కారు తీసి ఇంటికి బయల్దేరింది. అరగంట గడిచిందో లేదో వున్నట్టుండి కారు కీచుమంటూ పెద్ద శబ్దం చేసి ఆగిపోయింది. కారు దిగి ఫ్రంట్ డోర్ తీసి చూస్తే ఇంజన్ లోంచి పొగ వస్తుంది. కంగారులో కారులో పెట్రోలు వున్నదీ లేనిదీ చూస్కుంది కానీ కారు కండీషన్ గమనించలేదు.. అప్పుడు సమయం ఏడు దాటింది. హైవే కావడం తో నిర్మానుష్యం గా వున్న రోడ్డు.. చిక్కబడుతున్న చీకటి ఆమెలో భయం రేకెత్తించాయి.

వెంటనే మొబైల్ తీసి డ్రైవర్ రంగయ్యకు ఫోన్ చేసింది. రింగవుతుంది కానీ లిఫ్ట్ చెయ్యటంలేదు. ఎన్నిసార్లు చేసినా ఫోన్ తీయడంలేదు. ఆమెకు టెన్షన్ ఎక్కువయిపోతుంది. ఈ తాగుబోతు వెధవ ఫోన్ ఎక్కడ పడేశాడో... ఏంటో అనుకుంటూ అవినాష్ కి రింగ్ చేసింది. స్విచ్చాఫ్... ఓ గాడ్.. అవినాష్ చెప్పిన విషయం గుర్తువచ్చి తల కొట్టుకుంది. ఏం చెయ్యాలో తోచట్లేదు. తనకు కొన్ని వందల మంది స్నేహితులు ఆదుకునే స్నేహితులు ఫేస్బుక్ నిండా వున్నారు... కానీ ఫ్చ్ పాపం లోకల్ లో వుండి అవసరం లో ఆదుకునే స్నేహితులు మాత్రం లేరు. శాంతమ్మ లాంటి గతిలేని వారి ఫోన్ నెంబర్స్ తన దగ్గరుండవు. తన మొబైల్ లో వున్న ఫ్రెండ్స్ అందరూ హై పొజిషన్ లోని వారు... దూర ప్రాంతాల వారు... మొదటిసారి తన పరిస్థితి తనకే షేం గా అనిపించింది.

ఒకటీ అరా కార్లు తనను దాటుకుంటూ స్పీడుగా వెళుతున్నాయి. ఆ టైం లో ఎవ్వర్నో నమ్మి లిఫ్ట్ అడక్కూడదనీ ఆమె బావన. ఎందుకైనా మంచిదని మళ్ళీ రంగయ్యకు ఫోన్ చేసింది. ఈ సారి కూడా తీయలేదు. ఒక్కసారిగా నిస్సత్తువ ఆవరించిందామెకు. ఒళ్ళంతా భయం తో చెమటలు పడుతున్నాయి. ఈ లోగా తళుకున ఓ ఐడియా వచ్చిందామెకు. బెంగుళూరు లోని సాఫ్ట్ వేర్ కంపెనీ లో జాబ్ చేస్తున్న మానస బంధువులు ఈ ఊర్లోనే వున్న విషయం ఎప్పుడో చాటింగ్ ద్వారా తెల్సింది. వెంటనే మానసకు ఫోన్ చేసింది. వెంటనే లిఫ్ట్ చేసిన మానస హాఇ... హరీ... ఏంటే ఎప్పుడూ లేంది ఈ టైం లో ఫోన్ చేశావు. ఇప్పుడే ఇంటికి బయల్దేరాను... బైక్ మీదున్నాను అంటున్న మానసతో కంగారుగా ...తన పరిస్థితి వివరించింది నీహారిక అలాగే మానస బంధువుల తాలూకూ ఫోన్ నెంబరివ్వమని రిక్వెస్టు చేసింది.

విషయమంతా విన్న మానస ప్రాణస్నేహితురాలు కావడంతో ఫోన్ లోనే దులిపివేసింది నీహారికను. ఇంటిపని...పిల్లల చదువులు.. జాబ్ తో క్షణం తీరిక లేని నేను రోజులో ఏదో టైములో ఉదయం కానీ... లంచ్ అవర్లో కానీ నైట్ పడుకునే ముందు కానీ కనీసం ఒక పది నిముషాలు ఫ్రెండ్స్ కి హాయ్ చెప్పి రిఫ్రెష్ అవ్వచ్చని ఉద్దేష్యం తో ఫేస్ బుక్ ఓపెన్ చేసిన ప్రతిసారీ నువ్వు ఆన్ లైన్ లో దర్శనమిస్తున్నావు.. నీకు ఎలా కుదురుతుంది ఎప్పుడూ ఆన్ లైన్ లో వుండడం అని ఎన్నోసార్లు అడుగుదామనుకున్నా సంధర్భం రాక ఊరుకున్నాను. కానీ నాకు ఇప్పుడు అంతా అర్ధమయ్యింది. ఎంతసేపు ఏ.సి రూములో కూర్చుని చాటింగ్ చెయ్యటం తప్ప నీకు ఏంతసేపూ ఏ.సి రూములో కూర్చుని చాటింగ్ చెయ్యటం తప్ప నీకు ఏ బాధ్యతా లేదని తెల్సుకున్నాను.

చుట్టుపక్కల వారితో.... సమాజం లోని మిగతా వారి పట్ల నీకు చాలా బలహీనమైన సంబంధాలున్నాయని ఈ ఒక్క ఫోన్ తో నాకు అవగతమైంది. ఒక్క విషయం గుర్తుంచుకో నీహారికా! ఈ నెట్ పరిచయాలు స్నేహాలు.. సోషల్ వెబ్ సైట్స్... అందులో కనిపించే సుందర దృశ్యాలు అన్నీ ఆర్టిఫిషియల్ వి...... తాత్కాలికమైనవి. భర్తా...పిల్లలు...కుటుంబసభ్యులు..మన చుట్టు ప్రక్కవాళ్ళు వారానికి ఒక సారైనా మన ఇంటికి వచ్చి పలకరించే ఆత్మీయులు..శ్రేయోభిలాషులు వెళ్ళంతా సమాజం లో మనతో పాటు శాస్వతం గా సంబంధాలు కల్గినవారు.మనం ఏదైనా పని మొదలుపెడుతున్నప్పుడు భుజం తట్టి ప్రోత్సాహం అందించే ఆత్మీయులు ..అలాగే విజయం సాధించినపుడు షేఖ్యాండ్ యిచ్చి కంగ్రాట్స్ తెలిపే నిజమైన స్నేహితులు లేనప్పుడు మనం ఎంత సంపాదించినా ఎంత హై పొజిషన్ లో వున్నా.. మానవ సంబంధాలు సరిగ్గా లేనప్పుడు అదంతా వృధా ప్రయాస అవుతుంది. మన చుట్టు పక్కల వారి ఆనందం లో... బాధలో పాలు పంచుకుంటూ...

మనం చేయగలిగిన సాయం అందిస్తూ మనకు అవసరమైనప్పుడు వారి సహాయం అందుకుంటూ సమాజం లో మన పాత్ర గుర్తెరిగి ముందుకెళ్ళాలి... ఇకనైనా నువ్వు ఇది తెల్సుకుని ఇంతకాలంగా నువ్వు ఏది మిస్ అయ్యావో గ్రహించి అది ఆస్వాదించే ప్రయత్నం చేయి. ఎం.బి.ఏ లో గోల్డ్ మెడల్ సాధించిన నువ్వు తుప్పుపట్టిన యంత్రం లా ఇంట్లోనే వుండడం నాకు చాలా బాధగా వుంది... అని క్లాసు పీకి అధైర్యపడకు... అరగంటలో నువ్వున్న చోటికి వచ్చి కారులో తీసుకెళ్ళమని మా కజిన్ సిస్టర్ లతకు ఫోన్ చేస్తాను... అని ఫోన్ కట్ చేసింది మానస.

అసలే ఇన్నాళ్ళుగా తను చేస్తున్న పొరపాటుకి ప్రాక్టికల్ గా శిక్షను అనుభవిస్తున్న స్నేహితురాలి థియరీ క్లాసులో పూర్తిగా పశ్చాతాప పడింది. అంత చీకట్లో కూడా ఒంటరిగా బయట వెయిట్ చేయడం మంచిదికాదని కారు లోపల డోర్లన్నీ లాక్ చేసుకుని కూర్చింది. వెయిటింగ్ చేస్తూ క్షణమొక యుగం లా గడిపింది. ఇంతలో తన కారును దాటి స్పీడుగా ముందుకెళ్ళిన కారు సడన్ గా స్లో అయ్యి వెనక్కు వచ్చి తన కారు పక్కనే ఆగటం తో భయం వేసింది నీహారికను... హాయ్! మేడం నా పేరు ప్రభ..మా హస్బెండ్ శ్రీకాంత్... మేము కూడా స్వర్ణ అపార్టుమెంట్ లో మీతో పాటే అదే ఫ్లోర్ లో వుంటున్నాము. మీ హౌస్ నెంబరు పదిహేను... మాది పద్దెనిమిది అని చెప్పింది.

హలో ! నా పేరు నీహారిక... సారీ... మిమంల్ని నేను ఎప్పుడూ చూడలేదు అన్న నీహారికతో... నేను ఎన్నోసార్లు మీతో పరిచయం చేసుకోవాలని మీ ఇంటికి వచ్చినా మీరు ఎప్పుడూ సిస్టం ముందే ఉన్నారని శాంతమ్మ గారు చెప్పటం తో మీరు ఆన్లైన్ లో జాబ్ చేస్తుంటారేమో ... డిస్టర్బ్ చేయకూడదని నేను రావటం మానేసాను.. అయితే ఇందాక మిమ్మల్ని పిక్నిక్ స్పాట్ లో చూసాను. కానీ దూరం గా వుండ్డంతో కలవలేకపోయాను. కానీ రోజూ సెల్లార్ లో చూసే మీ కారు చూసి గుర్తుపట్టి ...ఆగి వుండడంతో వెనక్కు వచ్చామని గడగడా మాట్లాడుతోన్న ప్రభని చూసి ఆశ్చర్యపోయింది. తను స్పీడు గా టైప్ చేస్తూ చాటింగ్ చేయగలదు కానీ మాట్లాడలేదు.

ఈ లోగా మానస పంపిన లత, అర్జున్ లు కార్లోంచి దిగారు. నీహారికను గుర్తుపట్టి హాయ్! మేడం..మానస ఫోన్ చేసి చెప్పింది... మా వారు ఆఫీస్ నుంచి వచ్చాక బయల్దేరడంతో లేట్ అయ్యింది. ..సారీ...మేడం అని హాయ్! ప్రభా మీరేంటీ ఇక్కడ అని ప్రభని ప్రశ్నిస్తున్న లత వైపు ఆశ్చర్యం గా చూస్తున్న నీహారికతో మేడం మీకొక విషయం చెప్పాలి. మేము కూడా మీ అపార్టుమెంటులోనే థర్డ్ ఫ్లోర్ లో వుంటున్నాము, మానస మిమ్మల్ని గుర్తుపట్టతానికి నా ఫోన్ కి మీ ఫోటో పంపినప్పుడే చెప్పాను తనకి మీరు తెలుసనీ.. ఎనీవే రండి వెళ్దాం అనటం తో రెండేళ్ళుగా అదే అపార్టుమెంట్ లో నివసిస్తూ కూడా పొరుగువారిని...తోటివారిని ఇలాంటి పరిస్థితిలో పరిచయం చేసుకోవాలసి వస్తుందని చాలా అవమానంగా తోచింది నీహారికకు.

ఇంటికి చేరుకోగానే వాళ్ళందరికీ థాంక్స్ చెప్పి తన గదిలోకి వెళ్ళి నెట్ కనెక్షన్ పీకేసి ఇకపై తను అందరితో కల్సి వుంటూ అందరిలా వుండాలని నిర్ణయించుకుని ...హాయిగా నిద్రపోయింది... గుడ్ నైట్...



అమావాస్య చీకట్లు క్రమ క్రమంగా చుట్టూముడుతున్నాయి.

ప్రమిదల్లో నూనె పోసి వత్తులు పెట్టి చుట్టూవున్న ప్రహరీగోడమీద, గుమ్మానికి ఆవైపూ ఈ వైపూ, వీధి వాకిట్లోనూ అందంగా పేర్చి ఓపిగ్గా వాటిని వెలిగించింది. అప్పటిదాకా చీకటి ఆవరించి వున్న ఆ ప్రాంతం వెలుగులో కళా కాంతి సంతరించుకుంది. అలా దేదీప్యమైన కాంతితో ఆహ్వానిస్తే శ్రీ మహాలక్ష్మీదేవి ఇంట్లోకి రాకుండా వుంటుందా? ఒక్కొక్క గోరంత దీపం ప్రసరింపజేస్తున్న కొండంత వెలుగుని చూస్తూ కాస్సేపు తాదాత్మ్యతకు లోనయింది. నిజమే కళ్ళున్న వాళ్ళకే వెలుగులూ..సప్తవర్ణ శోభితరంగులు.. మరి కళ్ళులేనివారి పరిస్థితి? ఆమె కళ్ళు వర్షిత మేఘాలయ్యాయి..అప్పుడే అటుగా వచ్చిన శర్మగారు విచలితమనస్కురాలైన లక్ష్మి తల ఆప్యాయంగా నిమిరాడు. ఆయన మనసు కాస్త వెనక్కి వెళ్ళింది.

రెడ్డిరాఘవులు గారి పదహారేళ్ళ మనవడు దసరా సెలవులకని నెలరోజుల ముందుగా ఊరొచ్చి, మిత్రులతో గోదావరి నదిలో 'మునుగు ఈతతో ఎంతదూరం వెళ్ళగలమనే' పందెంవేసి ప్రాణాలు కోల్పోయాడు.

ఊరు ఊరంతా ఆయన బంగళాముందే వుంది. ఆ ఇంటి సభ్యులతో సహా అందరు శోకతప్తులై వున్నారు. రెడ్డి రాఘవులుగారంటే ఊరంతటికీ పెద్దదిక్కు. ఎవరికే అవసరం వచ్చినా ముందు నిల్చునేది ఆయన గడపముందే!

అక్కడే ఆయనకి కాస్త పక్కగా నిల్చున్నారు జగన్నాధ శర్మగారు. ఆ ఊరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పూజారి. శర్మగారంటే కూడా ఆ ఊరంతటికి ఎంతో గౌరవం. ఊళ్ళో ఎవరికి ఏ కష్టం వచ్చినా మనఃపూర్వకంగా దైవాన్ని కొలిచి వాళ్ళని ఆ కష్టం నుండి బయటపడేసేదాకా ఊరుకోరు. చాలా మంది అనుకుంటుంటారు 'ఆర్ధికంగా ఆయన..ఆధ్యాత్మికంగా ఈయన చూడబట్టే..ఊరు పచ్చగా వుందని.'

"రెడ్డిగారూ..మనం ఎంత బాధపడినా విధికి దయా దాక్షిణ్యం వుండదు. ఊరికి తండ్రిలాంటివారు మీరే ఇలా కృంగిపోతే ఇంట్లోని కుటుంబసభ్యుల సంగతి ఎవరు చూస్తారు? వాళ్ళనెవరు ఓదారుస్తారు? మీరు కాస్త గుండె దిటవు చేసుకుని తర్వాత చెయ్యవలసిన కార్యక్రమాలు చూసుకోవాలి" అన్నాడు ఆ ఊరి పెద్దరైతు విభూషణరావు.

మనసులో ఒక విషయం గురించి ఎంతో మదనపడి చివరికి 'రెడ్డిగారూ..మీతో మాట్లాడాలి కాస్త అలా వస్తారా?" అన్నాడు శర్మగారు.అందరి ముఖాల్లో ఆశ్చర్యం కొట్టొచ్చినట్టు ద్యోతకమయింది.

శర్మగారు ముందు నడిస్తే వెనక చిన్నగా రెడ్డిగారు అనుసరించారు. పెద్ద మామిడి చెట్టుక్రిందికి చేరాక "పుట్టెడు దుఃఖంలో వున్న మీతో ఇప్పుడు ఈ మాట మాట్లాడడం సరికాదు..కాని పదిమంది మంచికోరే మనం కొన్ని నిర్ణయాలు ఎలాంటి పరిస్థితుల్లోనయినా తీసుకోవాలి తప్పదు. పైగా ఇదే సరయిన సమయం..మీరంగీకరిస్తేనే అది జరుగుతుంది." అన్నాడు.

రెడ్డిగారూ అంత విషాదంలోనూ 'ఏమిటన్నట్లుగా' చూశాడు.

"మా లక్ష్మి తెలుసుగా! ఆమె చిన్నప్పుడు జరిగిన ప్రమాదంలో కంటిచూపు కోల్పోయిందని మీకు తెలుసు. ఒక్క చూపులేని లోపంతప్ప..సాక్షాత్తు శ్రీ మహలక్ష్మియే! అందుచేత.."కాస్తాగి రెడ్డిగారి ముఖంలోకి సాలోచనగా చూసి "మీ మనవడి కళ్ళు లక్ష్మికిస్తే..మీ దయతో తను ప్రపంచం చూడగలుగుతుంది. రేపు పెళ్ళైతే కుటుంబానికి బరువవకుండా భర్తకి తనవంతు సహకారాన్ని అందిస్తుంది..మీరేమంటారు?"అన్నాడు.

"మీరుచేస్తున్న మహోపకారం లక్ష్మికి కాదు, మాకు. ఈ ఆలోచన నాకెందుకు రాలేదో? ఒక్క కళ్ళే కాదు, అన్ని అవయవాలు దానం చేస్తాను. వాడు చిరంజీవిగా ఎంతోమంది రూపంలో మా ముందు తిరిగితే మాకంతకన్నా ఏం కావాలి? భగవంతుడు మీనోటివెంట పలికించి మాకు మంచి ఉపకారం చేశాడు. నేను మా కుటుంబసభ్యులతో ఒకసారి మాట్లాడి ఒప్పిస్తాను. మిగతా ఏర్పాట్లు కూడా చేస్తాను. విధివాడిని దూరం చేసినా, ఈ విధంగా మళ్ళీ దగ్గర చేసినందుకు మనసుకి శాంతిగా.. తృప్తిగా వుంది"అన్నాడు.

ఆయన అంత త్వరగా ఒప్పుకున్నందుకు మనసులోనే ఆ శ్రీవేంకటేశ్వరుడికి నమోవాకాలు అర్పించారు శర్మగారు.

యిదేళ్ళక్రితం శర్మగారు వీధివాకిట్లో పడక్కుర్చీలో కూర్చుని రామాయణం చదువుకుంటున్నాడు."అమ్మా నాలుగు ముద్దలు అన్నంపెట్టండి..ఆకలేస్తోంది" అని వినిపించి గేటువైపు చూశాడు.

తిండిలేక నీర్సించిపోయి..ముఖాన కళా కాంతిలేక..అక్కడక్కడ వున్న చిరుగులను సిగ్గుపడుతూ చేత్తో కప్పుకుంటూ అవస్తపడుతున్న ఆ పిల్లని చూడగానే ఆ దయాసముద్రుడి కళ్ళు చెమ్మగిల్లాయి.

"గేటు తీసుకుని ఇలా రా తల్లీ" అని పిలిచి.."నీదే పేరు?..ఏ ఊరు?" అడిగారు."నాపేరు లక్ష్మి అండి..మొన్నొచ్చిన వరదలకి

అమ్మానాన్నలతో సహా అన్నీ కొట్టుకుపోయి నేను మాత్రమే మిగిలాను..చిన్నప్పుడు జరిగిన ప్రమాదంలో కళ్ళు పోయాయి. అడుక్కుంటూ బయల్దేరి ఇలా ఇక్కడికొచ్చాను. శివాలయ మంటపంలో రాత్రికి నిద్రపోతున్నాను." అంది మనసులోని బాధని కన్నీళ్ళుగా స్రవిస్తూ."అయ్యో చిట్టితల్లీ! చిన్న వయసులోనే నీకెన్ని కష్టాల్రా?..కళ్ళులేని నిన్ను కనికరించాల్సింది పోయి..కబలించేస్తుందీ ప్రపంచం..నువ్వు మాతోపాటే వుందువు గాని" అని "దేవీ..ఈ పిల్లకి స్నానం చేయించి కట్టుకోడానికి సవ్యమైన బట్టలిచ్చి, కడుపు నిండా అన్నం పెట్టు..ఇవాళ్టినుండి ఈ లక్ష్మి మనకి దేవుడిచ్చిన కూతురు లక్ష్మి"అన్నాడు. అలా ఆ పిల్ల ఆ ఇంట్లో పిల్లయింది.

గుడ్డిపిల్లయినా చక్కటి తెలివితేటలిచ్చి భగవంతుడు తన లోపాన్ని సరిచేసుకున్నాడు. ఇంట్లోనూ..గుళ్ళోనూ..రామాయణ భాగవతాలు శ్రావ్యంగా గానం చేస్తూ..శర్మగారి..ఊరివారి మనసులకి ఊరట కలిగిస్తోంది.

ఆ పిల్ల అంటే ఊళ్ళో అందరికీ అభిమానమే! ఏ శుభకార్యం అనుకున్నా ముందు ఆ పిల్లకి చెప్పాల్సిందే! ఆమె పాల్గొనాల్సిందే!'పిల్లల్లేని తమకి భగవంతుడు తన అంశతో పిల్లని కానుకగా అందించాడేమో?' అనుకుంటారు ఆ దంపతులు లక్ష్మికి ఆరోజే కళ్ళ కట్లు విప్పుతారు.

శర్మగారు..రెడ్డిరాఘువులుగారితో సహా ఊరందరికీ ఆతృతగా వుంది.

లక్ష్మి కళ్ళు వచ్చేసాయి. ఆమె కళ్ళలో కళ్ళనీళ్ళ స్థానే ఆనందబాష్పాలు.

"తెగిన గాలిపటం లాంటి జీవితాన్ని ఒక గాడిన పడేశారు. కళ్ళులేని కబోదిలా ఈ ఊరు చేరాను. మీరందరూ కలసి నాకు చూపునిచ్చారు. మీ ఋణం తీర్చుకోలేనిది"అంది లక్ష్మి అనందం.. బాధ కలగాపులగంగా గొంతుని పట్టేస్తుంటే!

"తల్లీ..నువ్వు మా కష్టాలు గట్టెక్కించవచ్చిన శ్రీమహాలక్ష్మిదేవివి..నాలుగురోజుల్లో దీపావళి..నీ కళ్ళలో వెలుగులు నింపాము. ఈ దీపావళి మా ఊరికి ప్రత్యేకమైనది."అని రెడ్డిరాఘువులు గారు ఊరివాళ్ళవైపు తిరిగి "చూశారా! అవయవదానం మరొకరికి ఎలా జీవితాన్నిస్తుందో.. మీరందరూ కూడా చనిపోయిన మీ వాళ్ళని ఇలా బ్రతికించుకోండి.."అన్నాడు.అందరూ ఆనందంగా ఆక్షణంలో ఓ మంచి నిర్ణయం తీసుకున్నారు.

"అయ్యగారూ!"అన్నమాట వినిపించి ఈ లోకంలోకొచ్చారు శర్మగారు.

ఊరివాళ్ళందరూ "అయ్యా! ఈ తల్లి ఇలా మీ ఇళ్ళంతా దీపాలెడుతుంటే ఎంత కళగా వుందో! మీతో పాటూ దీపావళి సంబరంగా జరుపుకోవాలని వచ్చాం."

"అలాగే..నా తల్లి మా ఇంటికే కాదు మీరందరూ ఓ మంచి నిర్ణయం తీసుకునేలా చేసి ఈ ఊరికే వెలుగు ప్రసాదించింది. అన్నట్టు భద్రంగా బాణాసంచా కాల్చుకున్న తర్వాత కాళ్ళూ చేతులు కడుక్కుని మా లక్ష్మమ్మ చేసిన మిఠాయిలు తినడం మరవకండి!"అన్నారు నవ్వుతూ!




సార్!! ఒక సెన్సేషనల్ న్యూస్...అంటూ చీఫ్ ఎడిటర్ గోపాలం గారి గది లోనికి పరిగెత్తుకుని వచ్చినాడు దివాకర్.

రేపటి పత్రికలో ఏ వార్తలు మొదటి పేజి లో రావాలో ఏవి తరువాత రావాలో వరుస క్రమంలో పెడుతున్నాడు. అదే సమయం లో ప్రతి వార్తని క్షుణ్ణం గా పరిశీలించి ఏమైనా తప్పులు వుంటే వాటిని సరిజేసి ఒకదాని తరువాత ఒకటి అమరుస్తున్నాడు.

నిజం పత్రిక కి గోపాలం వ్యవస్థాపకుడు, నిక్కచ్చైన మనిషి, ఆ పత్రిక స్థాపించి 30 ఏళ్ళు అయినా ఏ ఒక్కనాడు ఏ ఒక్క వార్తా పత్రికా ధర్మం విడి అచ్చు వేయలేదు.. పత్రికా విలువలని అంత ఖచ్చితం గా పాటిస్తాడు. అందువల్లనే ఎన్ని పేరున్న పత్రికలున్నా తన నిజం పత్రిక లో ఏదైనా వార్త వస్తే అది నిజం అని ప్రజలు నమ్మే స్థాయిలో వుంది ఈ రోజు. దివాకర్, ఆ పత్రికలో కొత్తగా చేరిన రిపోర్టర్ మంచి తెలివి, జర్నలిజం లో యం. గోల్డ్ మెడలిస్ట్ కొత్తగా చేరినందుకు కాబోలు తనని తాను నిరూపించుకోవటానికి శతవిధాల కష్టపడుతునాడు. ఈ మధ్యనే ట్రాఫిక్ కూడళ్ళలో బిక్షగాళ్ళపై అతని పరిశోధనాత్మక వ్యాసం అందరినీ విస్మయపరిచే విధం గా వుండి అందరి మన్ననలు పొందింది అంతే కాకుండా దానికి గాను ఉత్తమ జర్నలిస్ట్ అవార్డ్ కు ఎంపికైనాడు.

గోపాలం ఒక్కసారి దివాకర్ వైపు చూసి ఏమిటా సెన్సేషనల్ న్యూస్ అన్నట్టు అడిగినాడు.

దివాకర్ వెంటనే... సార్! వర్ధమాన సినీనటి తార పోలీస్ రైడ్ లో దొరికింది, ఆమెతో పాటు ఒక ఎం.పి కొడుకు, ఒక వ్యాపారవేత్త వున్నారు. నా దగ్గర ఎవరికి లభించని ఫోటోలు వున్నాయి. ఆమెని ఒక వెల్ ఫేర్ హోం లో పెట్టినారట, అక్కడికి కూడా వెళ్ళి మరిన్ని ఫోటోలు తీసుకువస్తాను.

ఈ వార్త గాని మనం మొదటి పేజి లో ఫోటో లతో సహా అచ్చు వేస్తే మన పత్రిక సర్క్యులేషన్ ఒక్క సారిగా పెరుగుతుంది, ఇంకా మన పత్రిక కూడా పేరున్న పత్రికలకి ధీటుగా మార్కెట్లో వుంటుంది... ఏమంటారు? అని ఎంతో ఉత్సాహం గా అన్నాడు..

గోపాలం తాను చేస్తున్న పనిని ఆపేసి దివాకర్ పై చెయ్యి వేస్తూ పద అలా టీ తాగుతూ మాట్లాడుదాం అని బయటకు తీసుకువెళ్ళి ఒక హోటల్ లో కూర్చున్నారు. కాసేపటికి సర్వర్ తెచ్చిన టీ తాగుతూ గోపాలం మొదలుపెట్టినాడు. చూడు దివాకర్ నేను పత్రిక పెట్టినప్పుడు చాలా తక్కువ పత్రికలు వుండేవి, తరువాత చాలా పత్రికలు వచ్చినాయి. అందులో చాలా మటుకు పెట్టుబడి దారులు లేక రాజకీయ నాయకుల అండలో నడుస్తున్నవే. ఏ పత్రికలో వార్త గమనించినా నీకే తెలుస్తుంది అవి ఎంత ఉపయోగకరమైనవో... ఒక పత్రిక ఒక రాజకీయ నాయకుడి కోసం పనిచేస్తే ఇంకోటి ప్రభుత్వం కోసం పనిచేస్తుంది.. మరొకటి ఊహాగానాలతో వార్తలు వ్రాసి ప్రజల మొహాన పడేస్తాయి... అంతేకాని ప్రజల కోసం పనిచేసే పత్రికలుఎన్ని వున్నాయో వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు.

ఒక వార్త ప్రచురిస్తున్నాం అంటే అది ప్రజలకి ఎంత ఉపయోగం వుండాలో ఆలోచించాలి, అది ఒక్కసారి పత్రికలో వచ్చిన తరువాత

సమాజం లో ఎలాంటి ప్రభావం చూపుతుందో ఆలోచించాలి, అసలు ఆ వార్త ప్రజల సమస్యలని తెలియజేస్తుందా అని చూడాలి.మన పత్రిక గొంతుక ద్వారా ప్రజల ఇక్కట్లని బయట ప్రపంచానికి తెలియజేయాలి.

ఇప్పుడు చెప్పు నువ్వు తెచ్చిన సో కాల్డ్ సెన్సేషనల్ న్యూస్ ఎంతమందికి ఉపయోగపడుతుంది?

ఆ సినీ తార ఎన్ని కష్టాల్లో వుందో ఏ పరిస్థితుల్లో ఆ ఆ పని చేసిందో , పైగా ఆ ఫోటో లు వున్నాయి కాని ఆమెతో పాటు వున్న పెద్దవారి మాటేమిటి?

వాళ్ళు తప్పుచేయలేదంటావా?

ఆమెని తీసుకువెళ్ళి వెల్ఫేర్ హోం లో పెడితే మరి ఆ పెద్దమనుషులని ఏ హోం లో పెట్టాలి?

ఇవన్నీ నువ్వు ఆలోచించావా?

నువ్వు తెచ్చిన వార్త వల్ల మన పత్రిక సర్క్యులేషన్ పెరుగుతుందేమో కానీ సమాజానికి ఏ మాత్రం ఉపయోగపడుతుంది.. అది నాకు ఇష్టం లేదు.

నీకు నా పద్ధతి నచ్చకపోతే బయట చాలా పత్రికలు నీలాంటి వారి కోసం, నువ్వు ఈ రకమైన వార్తల కోసం ఎదురుచూస్తూ వుంటాయి, నిరభ్యంతరం గా వెళ్ళు,

ఆ తరువాత దివాకర్ కొన్ని రోజులు కనపడలేదు.. ఫోన్ చేసినా తీయలేదు.. వేరే పత్రికలో చేరి వుంటాడు అని గోపాలం మిన్నకుండిపోయాడు.

ఒక నెల తరువాత గోపాలం గదిలో యధావిధిగా తన పని చేస్తుంటే సర్ అనే పిలుపు వినిపించింది తల పైకెత్తి చూసాడు ఎదురుగా దివాకర్.ఏయ్ దివాకర్ ఎక్కడికి వెళ్ళినావు ఇన్ని రోజులు, ఫోన్ చేస్తే కూడా తీయలేదు అని అన్నాడు.

సార్ ఒకసారి ఈ వార్త చూడండి అని ఒక చిన్న బుల్లెట్ లాంటిది ముందుంచినాడు.

అది చదివి గోపాలం మొహం లో సంతోషం, కంట్లో కన్నీరు,, అది ఏజెన్సీలో వున్న ఆదివాసీ ల గురించి వారి కష్టాల గురించి వారికి సరైన మంచినీరు దొరకదు, మంచిగా చదువుకుందామంటే పాఠశాలలు లేవు, సరైన రహదారులు లేవు, వారి జీవితం దుర్భరం గా వుంది.దివాకర్ ఒక నెల అక్కడ వుండి అవన్నీ పరిశోధించి ఒక చిన్న రిపోర్ట్ తయారుచేసి గోపాలం ముందు వున్నాడు.

మొత్తం రిపోర్ట్ చదివిన గోపాలం ఆనందానికి అవధుల్లేవు, ఒక్క సారి దివాకర్ ని హత్తుకుని ఇలాంటి వార్తలే కావాలి.

మనకి, మన పత్రికకి...

ఆదివాసీ ల జీవితాలని కళ్ళకి కట్టినట్టు వ్రాసినావు. ఇలాంటి మార్పే నేను కోరుకున్నడి, రేపే దీన్ని అచ్చువేద్దాం అని అన్నాడు.దివాకర్ సంతోషం తో వెళుతుంటే గోపాలం అతనిని పిలిచి నీకు ఇంకో శుభవార్త బిక్షగాళ్ళపై ఎంతో కష్టపడి పరిశోధించి వ్రాసిన వార్తకి గాను ఉత్తమ జర్నలిస్ట్ అవార్డ్ కి నీ పేరే ఖరారైంది... చూద్దాం ఈ ఆదివాసీల కథనానికి ఇంకేం వస్తుందో అని అన్నాడు..

అంతా మీ ఆశీర్వాదం సార్, మీరు ఆ రోజు నాతో అలా మాట్లాడక పోయుంటే అలా హితబోధ చెయ్యకుంటే నాలో ఈ మార్పు వచ్చేది కాదు, మీ విలువలనీ నేను ఎప్పుడు నిలబెట్టడానికి ప్రయత్నిస్తాను అని సంతోషం గా బయటకి వెళుతుంటే గోపాలం చూడు దివాకర్ ఇప్పుడు వున్న పత్రికా కురుక్షేత్రం లో యుద్ధం గెలవగలగనే కాంక్ష వుండడం మంచిదే కానీ నువ్వు పాండవుల వైపా కౌరవుల వైపా అనేది బాగా ఆలోచించాలి అని అన్నాడు. దివాకర్ ఏమీ అర్థం కానివాడిలా చూస్తుంటే... అదేనయ్యా.. మనం ధర్మం వైపా అధర్మం వైపా ఎటువైపు వుండి పోరాడాలో నీలాంటి విద్యావంతులకి, తెలివిమంతులకి చెప్పాల్సిన అవసరం వుందా? అని అనగానే అర్థం అయింది సార్? అని కళ్ళు చేమర్చుకుంటూ బయటకి వెళ్ళినాడు... ఇంకో ధర్మ యుద్ధానికి సమాయత్తం కావటానికి...




"వ్వాట్...      గొంతుచించుకుని అరిచాడు కులకర్ణి. తన ఎదురు కుర్చీలో ఉన్న వ్యక్తినే చూస్తూ.

అతను విలాసంగా నవ్వాడు.

కులకర్ణికి ఒళ్లు మండింది.

ఒకప్పుడు తన ఎదురుగా నిలబడటానికే భయపడే వాడు .. ఇప్పుడు ధీమాగా కాలు మీద కాలేసుకుని కూర్చున్నాడు.

" సంస్థ అవసరం.      ఖచ్చితంగా తనతో కాళ్లబేరానికి దిగుతుంది. కోరినంత ఇచ్చి మరీ పని పూర్తిచేసుకుంటుందని

గ్రహించాడేమో...     అందుకే లెక్కలే నట్టుగా ప్రవర్తిస్తున్నాడు... ఈడియెట్ ...మనసులోనే     తిట్టుకున్నాడు.

తన అహం దెబ్బతిన్నా ముఖం మీద నవ్వు చెదరనివ్వలేదు.

ఓ మెట్టు దిగి అడిగాడు.

“ మిస్టర్ రంజాన్ ఆలీ...     ఇంతకీ మెషిన్ బాగుపడుతుంటారా?     ”

“ ఆ... తప్పకుండా...” అతను కూల్ గా సమాధానం చెప్పాడు.

“ నేనడిగిన మొత్తం     మీరు చెల్లిస్తే ...” అర్థోక్తితో ఆగిపోయాడు.     “ రిపేరుకు ఎంత సమయం పడుతుంది?” మళ్లీ అడిగాడు కులకర్ణి.

“ సరిగ్గా గంట..”

‘ఓ గంటలో పూర్తయ్యేపనికి ఆలీ ఇంత మొత్తం అడుగుతున్నాడూ అంటే తన విలువను గుర్తించాడన్నమాట...’ అనుకున్నాడు కులకర్ణి.అంత     డబ్బుఇవ్వకుండా ఆలీని ఎలా దారికి తెచ్చుకోవాలా అని     ఆలోచిస్తున్నాడు.     పాతికేళ్ల అనుభవంలో అతను ఎందరో ఉద్యోగులను     చూశాడు.

కొందరిని ఓసారి పలకరిస్తేచాలు.. ఉబ్బితబ్బిబ్బయిపోతారు.

బాగా పనిచేస్తున్నావన్న చిన్న ప్రశంసకే లొంగిపోతారు కొందరు.

కొంత మంది పనిలో లోపాలు ఎత్తి చూపకుండా ఉంటే చాలని సర్దుకుంటారు.

చిన్న మొత్తం ఇన్సెంటివ్ గా పడేస్తే చాలు... గొడ్డుచాకిరీ చేసేవాళ్లు మరి కొందరు.

ఉద్యోగుల అంతర్గత విషయాలు తెలుసుకోటానికి ఇన్నాళ్లూ రకరకాల ఎత్తులు వేశాడు తను. సాధారణంగా అవన్నీ మంచి ఫలితాలనే ఇచ్చాయి.

సామ,దాన, భేదోపాయాల్లో ఏదో ఒకటి ప్రయోగించి దారికి తెచ్చుకోవాలనుకున్నా.. ఎందుకో గానీ అవన్నీ ఇతని ముందు పనికిరాని ఆయుధాలేనని అనిపిస్తోంది.

తను ఎందుకింత నిస్సహాయంగా మారిపోయాడు.

అతని ఆలోచనలు నాల్రోజులు వెనక్కి మళ్లాయి.

"ఇప్పుడెలా? ఏం చేద్దాం" అందరూ తలలు పట్టుకున్నారు.

కులకర్ణి ఛాంబర్లో అన్ని విభాగాల అధిపతులు సమావేశమయ్యారు.

జపాన్ నుంచి తెచ్చిన మెషిన్ మొరాయించటం... దాన్ని తిరిగి దారిలో పెట్టటానికి ఏం చేయాలి అన్న ఒకే అంశం అజెండాగా అక్కడ చర్చసాగుతోంది.

" ఆర్డర్స్ ప్లేస్ చేసిన వాళ్లు ప్రొడక్టు పంపమని తెగ ఒత్తిడి చేస్తున్నారు" మార్కెటింగ్ మేనేజర్ చెప్పటం ప్రారంభించాడు. " మనం తక్షణం స్పందించకపోతే ఆర్డర్లు వెనక్కిపోతాయి. రెండు మూడ్రోజుల్లో అన్నీ సర్దుకుంటాయని మార్కెటింగ్ వాళ్లందరికీ నచ్చచెబుతున్నాం. " అన్నాడు పరిస్థితిని వివరిస్తూ.

" ఆర్డర్ల సంగతి పక్కన పెట్టు. మూడ్రోజులుగా ప్రొడక్షన్ ఆగిపోయింది. లక్షల్లో నష్టం వస్తోంది. ఇదిలాగే కొనసాగితే... కొంప కొల్లేరవుతుంది'.. ప్రొడక్షన్ మేనేజర్ చెప్పుకొచ్చాడు.

“ మేం చేయగలిగిన ప్రయత్నం అంతా చేశాం. సిటీలో ఉన్న టాప్ ఇంజనీర్లందరినీ పిలిపించి చూపించాం. ఎవరి వల్లా కాలేదు. ఆర్ అండ్ డీ వాళ్లు తమ ప్రయత్నాలు చేశారు. ఇప్పడేం చేయాలో పాలు పోవటం లేదు” డిప్యూటీ మేనేజర్ తలపట్టుకున్నాడు.

“మీ అందరికీ జీతాలిచ్చేది సమస్యలొచ్చినప్పడు పరిష్కరించటానికే అంటాడు ఛైర్మన్. అసలు ఇన్ని రోజులూ విషయం ఆయన దృష్టికి తేనందుకు మనల్నందరినీ శంకరగిరి మాన్యాలకు పంపుతాడేమో” సందేహం వ్యక్తం చేశాడు ఇంకో డిప్యూటీ మేనేజర్.

“ ఆయనకి తెలియకుండా ఉండదు. నువ్వొక్కడివి చెప్పనంత మాత్రాన విషయం తెలియకుండా ఉంటుందంటావా? మనం ఎలా ఈ సమస్యనుంచి బయటపడతామా అని వేచి చూస్తూంటాడు బహుశా...” అన్నాడు పక్కనున్న స్టోర్సు డిపార్టుమెంట్ అధికారి.“ ఏడాదిన్నర క్రితం జపాన్ నుంచి ఈ సెకండ్ హేండ్ మిషన్ తెచ్చారు. అప్పటికే అది వాడి పారేసింది. తక్కువ ఖర్చుతో వచ్చింది కదా అని తెచ్చుకొచ్చి ఇక్కడ తగలేశారు. పనిచేయకపోతే దీన్ని ఉంచుకోలేం. అలాగని వదిలించుకోలేం”... చికాకుపడుతూ చెప్పాడు క్వాలిటీ కంట్రోల్ అధికారి. “ ఆ సంస్థని వేరెవరో టేకోవర్ చేశారు. ఈ ప్రొడక్టును పక్కన పడేశారు. ఇప్పుడు దీని గురించి పట్టించుకునే నాధుడే లేడు. ఓ పనికిరాని మెషిన్ తెచ్చి వ్యవహారం నడుపుతున్నాం అని బయటికి పొక్కితే మన ప్రతిష్ఠకూడా మంట గలుస్తుంది”

కులకర్ణి అందరూ చెప్పింది సావధానంగా విన్నాడు.

“ మన సంస్థలో ఏ ఉద్యోగయినా సమస్యను పరిష్కరించగలరేమో తెలుసుకున్నారా? అలా మంచి సలహా ఇచ్చిన వాళ్లకి నగదు బహుమతి ఇద్దాం” సూచించాడు.

చాలా మందిని తొలగించారని సంస్థ పట్ల ఉద్యోగులు గుర్రుగా ఉన్న విషయం అతనికి తెలుసు.. చిన్నదో, పెద్దదో... ప్రోత్సాహకాలతో ఏ ఉద్యోగినయినా దారిలోకి తెచ్చుకోగలనన్న నమ్మకం అతనిది. అందుకే ఆ మాట చెప్పాడు.

“ సీనియర్ ఉద్యోగులందరినీ మనం తొలగించి, ఆయా స్థానాల్లో కొత్తవాళ్లని నియమించుకున్నాం కదా... ఉన్న వాళ్లలో ఎక్కువ మంది కాంట్రాక్ట్ ఉద్యోగులే. వారికి అనుభం లేదు. నైపుణ్యాలూ అంతంత మాత్రమే. ” హెచ్ ఆర్ మేనేజర్ బదులు చెప్పాడు.

“ఇతర రాష్ట్రాల్లో ఈ తరహా సంస్థలున్న చోటకు ఉద్యోగులెవరినయినా పంపితే… కులకర్ణి ఆలోచిస్తున్నాడు.

ఆ సమయంలో ఠక్కున ఆర్ అండ్ డి మేనేజర్ చెప్పాడు.

“పోనీ… రంజాన్ ఆలీని పిలిపిస్తే..”

“ అదే మంచిది…” ముక్తకంఠంతో అందుకున్నారంతా.

“ ఈ మిషన్ బిగించినప్పుడు అతనే కీలకపాత్ర పోషించాడు. ఖచ్చితంగా అతను దీన్ని దారిలో పెట్టగలడన్న నమ్మకం మాకుంది.”
“ మనం సంస్థ నుంచి తొలగించాం కదా… ఇప్పుడు పిలిస్తే వస్తాడంటారా?” కులకర్ణి సందేహం వ్యక్తం చేశాడు.

“ అదంతా మేం చూసుకుంటాం. రేపు ఉదయం మీరు ఆఫీసుకు వచ్చేటప్పటికల్లా మీ ముందు హాజరుపరుస్తాం” అన్నాడు హెచ్ ఆర్ మేనేజర్.

“ సరే” అనుమతించాడు కులకర్ణి.

సమావేశం ముగిసింది.

అప్పటికప్పుడే రంజాన్ ఆలీకి కబురువెళ్లింది.

ఒక్కసారి ఆలోచనల నుంచి బయటకొచ్చి చెప్పాడు కులకర్ణి.

“ మీరడిగింది చాలా పెద్ద మొత్తం..

అదీ ఓ గంట పనికి” కోపాన్ని తమాయించుకుని సాధ్యమైనంత మృదువుగా మాట్లాడటానికి ప్రయత్నిస్తున్నాడు.

“ అదేం కాదు. మీ పని విలువ నాకు తెలుసు.

అది స్తంభిస్తే మీ కొచ్చే నష్టం కోట్లల్లో అని కూడా తెలుసు” అదే ధీమాతో చెప్పాడు రంజాన్ ఆలీ.

“ మీ ఇష్టం. మీకు నచ్చితేనే చెల్లించండి” అన్నాడు తనే మళ్ళీ.

ఎలాగయినా కంపెనీ తన దారికొచ్చి కోరింది చెల్లిస్తుందని అతనికి తెలుసు. “ఇదేమయినా న్యాయంగా ఉందా? ఏ వెయ్యి రూపాయలో తీసుకుని పని పూర్తి చేయవలసింది పోయి మరీ ఇంత మొత్తం అంటే...” బేరం ఆడటం ప్రారంభించాడు కులకర్ణి.
“ నేను కోరిందానిలో... కేవలం 20 శాతం నా శ్రమకి ఫీజు. మిగిలింది అదెలా చేయాలో నాకొక్కడికే తెలియటం వల్ల ఆ పరిజ్ఞానానికి, అనుభవానికి మీరు చెల్లించవలసిన ఖరీదు.... ”

ఆలీ మెత్తగా మాట్లాడుతున్నా ఒక్కో మాట శూలాల్లా గుచ్చుతున్నాయి. తన ఎదురుగా కూర్చున్న సాధారణ ఉద్యోగి ప్రవర్తన, మాట్లాడుతున్న తీరు రెండూ కులకర్ణికి భరించరానివిగా మారుతున్నాయి. అసహనం కట్టలుతెంచుకుంటోంది.

“ ఇది పచ్చి అవకాశవాదం...” అన్నాడు కోపంతో.

“ఉద్యోగిని వాడుకుని వదిలేసే నైజం ఈ యాజమాన్యానిది. నాది కాదు ” అన్నాడు ఆలీ స్వరం పెంచి మరీ. ఆ తర్వాత చెప్పాడు దూకుడుగా.

“ జపాన్ మెషిన్ ఇన్ స్టాల్ చేసేవరకూ నన్ను ప్రేమగా దువ్వారు. రేయింబవళ్లు పనిచేయించారు.

ఆ తర్వాత .. సీనియర్ నన్న మిషతో మిగతా అందరితో పాటు నన్ను కూడా బయటకి పంపారు.

ఒక్క నిముషం కూడా కంపెనీపైన నా కున్న చిత్తశుద్ధిని, అంకిత భావాన్ని మీరు పట్టించుకోలేదు.

మేమిచ్చే జీతం రాళ్లకోసం పనిచేశావు. సిన్సియారిటీ అని దానికి పెద్ద పేరు అవసరమా? అంటూ నా శ్రమని, పనితనాన్ని చిన్నబుచ్చారు. ఇంత కంటే మరెవరయినా ఎక్కువ జీతం ఆఫర్ చేస్తే వెళ్లకుండా ఉంటారా? '' అని వ్యాఖ్యలు చేశారు. ఇదే కంపెనీని దాదాపు పాతికేళ్లు అంటిపెట్టుకుని ఉన్న నేను అసమర్ధుణ్ణని, గతిలేకే ఇన్నాళ్లూ ఇక్కడ కొనసాగానని అర్ధం వచ్చేలా మాట్లాడారు.

మీ తీరు వల్ల ఎంత మంది ఉద్యోగుల మనసులు గాయపడుతున్నాయో ఏనాడయినా ఆలోచించారా? సాధారణంగా పనిచేసేవాడికి, ప్రతిభ చూపించేవాడికి మధ్య తేడాను సంస్థను గుర్తించనంత కాలం.. ఇదిలాగే కొనసాగుతుందిసార్..''

కులకర్ణికి ఏలా స్పందించాలో అర్ధం కాలేదు.

ఆలి కోరింది పెద్ద మొత్తమే. అదికాదంటే మెషిన్ గాడిన పడదు. ప్రొడక్షన్ ఊపందుకోదు.

బోర్డు ఆఫ్ డైరక్టర్స్ అందరి ద్వారా మాట్లాడి ఛైర్మన్ ని ఎలాగయినా ఒప్పించవచ్చు. ముందు ఈ గండం నుంచి గట్టెక్కాలి. గబగబా చెక్ రాసి సంతకం చేశాడు.

'' ఒకప్పుడు చేతులు కట్టుకుని ఒక్క మాటయినా మాట్లాడని వాడు.. ఇలా ఎందుకు పేట్రేగిపోతున్నాడు అని ఆలోచిస్తున్నారు కదూ..''ఆ మాటలకు కులకర్ణి ఉలిక్కిపడ్డాడు. తన మనసులో విషయాన్ని ఇతను ఎలా గ్రహించాడో అనుకున్నాడు.

''ఒక్కసారి ఆ ఆలోచనని పక్కనపెట్టండి.

మీరూ నా లాంటి ఉద్యోగే.. మా లాంటి పరిస్థితే రేపు మీకూ ఎదురుకావచ్చు. అప్పుడు ఏం చేస్తారు? మీ భార్యాబిడ్డలకు ఏం సమాధానం చెబుతారు?

బాగాపనిచేయటంలేదని కంపెనీ నన్ను తొలగించిందని చెప్పుకోగలరా?

తలెత్తుకు జీవించగలరా?      ఒక్క నిముషం మానవత్వంతో ఆలోచించి చూడండి.''

ఆలీ మాటలు పరుషంగా ఉన్నా... అందులో నిజం ఉందనిపించింది కులకర్ణికి

'' ఏ సంస్థకయినా అనుభవం ఉన్న ఉద్యోగులు      అవసరం. అనుభవం ఉన్న ఒక ఉద్యోగిని ఇంటికి పంపేస్తే ఆ వేతనంతో నలుగురు కొత్త వాళ్లను తీసుకోవచ్చన్న ధోరణి ఎప్పటికయినా చేటు తెస్తుంది.

మీ క్షేమం కోరుకుంటూ..      సంస్థను ప్రాణప్రదంగా భావించే వాళ్లని ...      మీరు నెత్తిన పెట్టుకోకపోయినా ఫరవాలేదు... కనీస గౌరవ మర్యాదలతో చూడండి... అందరినీ వదులుకుంటే      చివరికి ఏదో ఒక రోజు ఇలాంటి పరిస్థితే వస్తుంది. ఆపత్కాలంలో ఆదుకునే వాడే ఉండడు.

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోలేక.. ఎన్నో పేరొందిన కంపెనీలు కాలగర్భంలో కలిసిపోయాయి.      మీ రెంత?నేను శాపనార్థాలు పెట్టటంలేదు సర్ . ఉద్యోగాలు కోల్పోయిన వారి ఉసురు మీకు తగులుతుందన్న హెచ్చరికలూ చేయటంలేదు. పరిస్థితిని చెప్పానంతే...''ఇక తను చెప్పదలుచుకున్నది పూర్తయినట్టు లేచి నిలబడ్డాడు రంజాన్ ఆలీ.

టేబుల్ మీదున్న చెక్ ను అందుకుని జేబులో పెట్టుకున్నాడు.

స్ప్రింగ్ డోర్ తెరుచి బయటకు వెళుతూ ..

ఒక సారి వెనక్కితిరిగి చూసి చెప్పాడు.

“ ఈ డబ్బు మా అబ్బాయి ఇంజనీరింగ్ కాలేజీ ఫీజుకి ఉపయోగపడుతుంది.

థ్యాంక్యూ సర్...      ”

నోటి మాటరాక మాన్పడిపోయాడు కులకర్ణి.




నందనపురంలో ఉన్న నాంచారయ్య ఉన్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేసుకుంటూ గుట్టుగా సంసారం గడిపేవాడు. అతడి

పొలం ప్రక్కనే భూస్వామి భూషయ్యకి పాతిక ఎకరాల పొలం ఉంది. అయితే భూషయ్య మంచివాడు కాదు. ఎలాగైనా నాంచారయ్య పొలాన్ని తన పొలంలో కలుపుకోవాలని దుర్మార్గపు ఆలోచన మొదలుపెట్టాడు భూషయ్య.

భూషయ్య ఆలోచన అమలులో భాగంగా కొందరు పనివాళ్ళు పొలం గట్లు తవ్వేసి నాంచారయ్య పొలంలో కొత్తగా వేసారు. అందువల్ల నాంచారయ్య పొలం విస్తీర్ణం తగ్గిపోయింది. నాంచారయ్య వెళ్లి పనివాళ్ళని అడిగాడు.దానికి వాళ్ళు వెకిలిగా నవ్వి "భూషయ్యకి ఎన్నో భూములుండగా నీ భూమి కావలసివచ్చిందా? అనవసరంగా గొడవ పెట్టుకోవద్దు. అది నీకు మంచిది కాదు" అని బెదిరించారు. నాంచారయ్యకి ఏం చెయ్యాలో తోచలేదు. మౌనం వహించాడు. మరొక ఆరునెలలు గడిచాక మళ్ళీ అదే పని చేసారు భూషయ్య మనుషులు. అప్పుడు మాత్రం నాంచారయ్య గ్రామాధికారిని కలిసి ఫిర్యాదు చేసాడు.

ఆ గ్రామాధికారి పిరికివాడు. అతడికి భూషయ్య దుర్మార్గాలు తెలిసినా భయపడి మౌనం వహిస్తాడు. అందుకే నాంచారయ్య చెప్పింది వినకుండా "భూషయ్యకి నీ భూమే కావలసి వచ్చిందా? అతడు తలచుకుంటే నీ భూమి మొత్తం కలుపుకోగలడు. కేవలం గట్లు ముందుకి జరిపి కొంచెం భూమి ఆక్రమించాల్సిన అవసరమేముంది" అని కసిరి పంపించేసాడు. దాంతో నాంచారయ్య బాధ పడుతూ వెనుతిరిగాడు.అతడికి దారిలో వరుణయ్య కనిపించాడు. అతడు నాంచారయ్యకి బాల్యమిత్రుడు. నాంచారయ్య విచారానికి కారణమడిగాడు. అప్పుడు నాంచారయ్య జరిగింది చెప్పాడు. నాంచారయ్య వైపు జాలిగా చూసిన వరుణయ్య "భూషయ్య లాంటి వాడితో చాలా ప్రమాదం. కానీ ఒక సంగతి చెబుతాను. అందువల్ల నీకు మేలు జరుగుతుందేమో" అన్నాడు.దానికి నాంచారయ్య "త్వరగా చెప్పి పుణ్యం కట్టుకో " అన్నాడు బ్రతిమలాడుతూ.

అప్పుడు వరుణయ్య ఇలా చెప్పాడు. "ఆ మధ్య భూషయ్యను పొరుగూరులో ఉన్న కౌశికుడు ఆశ్రమంలో చూశాను. రెండు మూడు ప్రమాదాలు జరిగి త్రుటిలో ప్రాణాపాయం తప్పడంతో భూషయ్యలో పాపభీతి పెరిగిందని విన్నాను. దైవానుగ్రహం కోసం పూజలు చేయించాడని తెలిసింది. కౌశికుడుని కలుసుకుని నీ కష్టం చెప్పుకుంటే మేలు జరుగవచ్చు" అని చెప్పాడు.

నాంచారయ్య వెంటనే కౌశికుడు ఆశ్రమానికి వెళ్లి ఆయన పాదాల మీద పడి భూషయ్య చేస్తున్న అన్యాయం వివరించి కాపాడమన్నాడు.దానికి కౌశికుడు "నా ఆశ్రమంలో మంచివాళ్లకే ప్రవేశం ఉంటుంది. దుర్మార్గులెవరైనా నా శిష్యులలో ఉన్నా వారిని సన్మార్గంలోకి నడపడానికే నేను ప్రయత్నిస్తాను. నీవు చెప్పడం వల్ల భూషయ్యలో ఉన్న చెడు నడత తెలిసింది. నేను అతడిని పిలిపించి మాట్లాడతాను. తప్పకుండా పరివర్తన తీసుకు వస్తాను. నువ్వు ధైర్యంగా ఉండు" అని మాట ఇచ్చాడు.

తరువాత కౌశికుడి దర్శనానికి భూషయ్య వచ్చినప్పుడు అతడికి ఎన్నో మంచి మాటలు చెప్పాడు. "నువ్వు చేసిన పాపం పెరగడం వల్ల నీకు ప్రమాదాలు జరుగుతున్నాయి. అందుకే పూజలు జరిపించాను. అవి చాలవన్నట్టు కొత్తగా నాంచారయ్య పొలాన్ని ఆక్రమించావని తెలిసింది. దానివల్ల నీవు చేసుకున్న పూజల ఫలితం కోల్పోయావు. మళ్ళీ నీకు ప్రాణహాని పొంచి ఉంది.

ఇతరుల సొత్తుపై మోజు పడడం తగని పని. ఈ లోకంలో నీది అనుకున్నదేదీ నీది కాదు. నీ కష్టార్జితం తప్ప మరేదీ నీకు మేలు చెయ్యదు. నువ్వు దురాశతో, మోసంతో సంపాదించే ఆస్తి నీ పాపాన్ని పెంచుతుంది. ఎంత సంపాదించినా జానెడు పొట్ట కోసమే కదా! దానికోసం పాపాలు చెయ్యాలా? ఇతరుల ఆస్తి దోచుకోవాలా? గతజన్మలో చేసిన పుణ్యం వల్ల మనిషి జన్మ ఎత్తావు. ఈ జన్మలో మళ్ళీ పాపాలు చేసి మరుజన్మలో నీచమైన పుట్టుకకు పునాదులు తవ్వుకుంటున్నావు.

నువ్వు చేసే మంచి పనుల వల్ల, దానధర్మాల వల్ల వచ్చే కీర్తి తప్ప ఏదీ నీ వెనుక రాదు. ఉన్న దానితోనే సంతోషపడుతూ ఉన్న దాంట్లోనే ధర్మంగా బ్రతుకుతూ జీవిస్తే వచ్చే తృప్తే వేరు. ఇక ముందు అలా బ్రతుకుతానని నా ముందు ప్రమాణం చేస్తేనే ఇక ముందు నా ఆశ్రమంలో నీకు ప్రవేశం ఉంటుంది." అన్నాడు .

దానికి భూషయ్య చాలా సేపు ఆలోచించాడు. అతడికి కౌశికుడు చెప్పింది సబబే అనిపించింది. వెంటనే కౌశికుడి కాళ్ళ మీద పడ్డాడు. "నాకు బుద్ధి వచ్చింది. నేను ఈ రోజు నుండి పాపపు పనులు మానుకుంటాను. నన్ను మీరు నమ్మాలంటే నేనేం చెయ్యాలో సూచించండి" అని అడిగాడు.

అప్పుడు కౌశికుడు "నీలో పరివర్తన వస్తే ఒక సాధువుగా, గురువుగా నా కంటే సంతోషించేవారు మరెవరూ ఉండరు. నీవు నాకోసం ఏమీ చెయ్యక్కరలేదు. నీ సంపాదనలో నుంచి ఇవ్వక్కరలేదు. నువ్వు అన్యాయంగా ఆక్రమించుకున్న నాంచారయ్య భూమిని అతడికి న్యాయంగా అప్పగించు" అన్నాడు.

దానికి భూషయ్య అలాగే అని ప్రమాణం చేసాడు. అప్పటి నుండి పాపపు పనులు మానుకుని ప్రవర్తనలో పరివర్తన తెచ్చుకున్నాడు. గ్రామస్తులకు భూషయ్య బెడద వదిలించిన నాంచారయ్యని ప్రజలందరూ మెచ్చుకున్నారు.




"పొరబాటు జరిగిపోయింది సార్! మీరే ఎలాగైనా గండం గట్టెక్కించాలి" వణకిపోతూ ఏకాంబరం హెడ్మాస్టర్ శంకరం గదిలోకి వచ్చాడు.

"ఏమైంది ఏకాంబరం?" హెడ్మాస్టర్ ఆందోళనతో అడిగాడు.

"స్టూడెంట్ కౌన్సెలర్ కొడుకని తెలియక ..."

"తెలియక ...?" హెడ్మాస్టర్ కంఠంలో అదుర్దా.

"వాడు రెండు రోజులుగా హోం వర్క్ చేయడం లేదు. గట్టిగా మందలిస్తూ ఒక దెబ్బేశాను. అందుకే కౌన్సెలర్ గొడవకొచ్చాడు. పెద్దపెద్దగా అరుస్తున్నాడు" గొంతులో అసహనం స్పష్టంగా కనిపిస్తోంది.

"పిల్లవాడికి పెద్ద దెబ్బలేం తగల్లేదుగా?"

"అరచేతులు కొంత ఎర్రబారాయి."

"చూడు ఏకాంబరం! పిల్లల్ని బెదిరించి భయపెట్టాలే గానీ ..."

" మెల్లగానే కొట్టాను గానీ బెత్తం కొంచెం..."

"కంగారు పడకు. లోపల ఆఫీస్ రూంలో కూర్చో! ఏం చేయాలో ఆలోచిద్దాం. "

ఏకాంబరం లోపలికెళ్ళాడు. హెడ్మాస్టర్ ఆలోచనలో పడ్డాడు.

ఏకాంబరం లెక్కల మాస్టార్. కొత్తగా ఈ మధ్యనే జాయిన్ అయ్యాడు. ఎనిమిది, తొమ్మిది, పది క్లాసులకు లెక్కలకి వెళ్తాడు. కొంచెం ముక్కుసూటి మనిషి. కష్టపడే తత్వం. డ్యూటి ఒరిఎంటెడ్.

ఇంతలో ఆ కౌన్సెలర్ ఐదారు మందితో గదిలోకి దూసుకొచ్చాడు.

"ఏం చేస్తున్నారు? పిల్లల్ని ఇలా గొడ్డును బాధినట్లు బాదుతుంటే ... మీకు పిల్లా జెల్లా లేరా? " సూటిగా గద్దించాడు హెడ్ మాస్టర్ని.

"చూడండి కౌన్సెలర్ గారూ! ముందు మీరు కూర్చోండి. ఆవేశ పడకండి." సర్ది చెప్పబోయాడు హెడ్మాస్టర్.

"కూర్చోవడానికి రాలేదండి…అటో ఇటో తేల్చుకోవడానికి వచ్చాను."

"అదికాదండీ! “

“ఏది కాదండి… నేను కౌన్సెలర్ని. నా కొడుకునే ఇలా బాదితే ఇక మిగతా పిల్లల పరిస్థితేంటి? …" మనిషి ఊగిపోతున్నాడు.

"అసలేం జరిగిందంటే ….. ఈ మధ్య అబ్బాయి హోం వర్క్ చేయకుండా వస్తున్నాడట …కొంచెం భయపెట్టామని చిన దెబ్బ వేశాడట."

"చిన్న దెబ్బా ! చూడండి !ఒరేయ్ ఇలా రారా చెయ్ చూపించు హెడ్ మాస్టార్కి" అబ్బాయిని ముందుకు తోశాడు.

అబ్బాయి చెయ్ చూశాను. కొంచెం ఎర్రగా వాత పడింది.

"క్షమించండి! మా లెక్కల మాస్టార్ కుర్రోడు. ఇక మీద అలా జరక్కుండా చూస్తాను. అతని తరపున నేను క్షమాపణలు కోరుతున్నాను" ప్రాధేయ పడ్డాడు హెడ్మాస్టర్.

"కుర్రోడైతే ఇలా చంపమని చెప్తారా? వాడెక్కడున్నాడో చెప్పండి. వాడి అంతు చూడకుండా వదలం. " ఆవేశంతో ఊగిపోతున్నారు అతనితో వచ్చిన అనుచరులు.

“మీడియా వాళ్ళను, మనోళ్ళను పిలవండ్రా…ఈవేళ అటో ఇటో తేలిపోవాలి.”

"దయచేసి దీన్ని ఇష్యూ చేయకండి. పెద్ద మనసుతో క్షమించండి. నేను ఆయన్ని మందలిస్తాను."

"నో. వాణ్ణి నాకప్పచెప్పండి. అంతుచూస్తాను. రేయ్! వాడెక్కడున్నా ఈడ్చుకురండి. " హుకుం జారీ చేశాడు కౌన్సెలర్.

జనం గుమిగూడిపోయారు. అందరి అభిప్రాయాలు చాలా ఫ్రీ గా దొర్లిపోతున్నాయి..

"ఇంతలా పిల్లల్ని కొట్టేవారు ఉపాధ్యాయులా .. రాక్షసులా? "

"వాళ్ళకు పిల్లల్లేరా? ఉంటే ఇలా కొడ్తారా?"

"పసిపిల్లల్ని కొట్టడానికి చేతులెలా వస్తాయి?"

వారు రెచ్చిపోతున్నారు.

ఇంతలో టీ వీ రిపోర్టర్స్ రంగంలో దిగారు.

జనంలో దూరిపోయి - "మీ స్పందనేమిటి? " అంటూ జనాభిప్రాయం సేకరించడం మొదలెట్టారు.

అగ్నికి ఆజ్యం పోసినట్లు జనం రెచ్చిపోతున్నారు.

టీ వీ ఛానెల్స్ పంట పండింది. బ్రేకింగ్ న్యూస్ ల హోరు మొదలయింది.

"విద్యార్థి పై ఓ గురువు దాష్టీకం."

" హోం వర్క్ చేయలేదని చిన్నారిని చితకబాదిన కిరాతకుడు ."

టీ వీ ల్లో చర్చలు, వాదోపవాదనలు మొదలయ్యాయి. ఎపుడెప్పుడు ఇలా చిన్నార్ల పైన ఎన్నెన్ని దాడులు జరిగాయో వివరంగా గణాంకాలతో వండి వారుస్తున్నారు. ఏమేమి చర్యలు తీసుకోవాలో సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

ఇంతలో ఒకడు ఆఫీస్ రూం నుంచి ఏకాంబరాన్ని చొక్కా పట్టి లాక్కు వచ్చాడు.

"ఇదిగో అన్నా! వీడు అక్కడ దాక్కున్నాడు."

'వదలకండి! వాణ్ణి వేసేండ్రా?" ఏకాంబరం పైన లంఘించుకున్నాడు కౌన్సెలర్.

కాలర్ పట్టుకొని "ఎంత ధైర్యం రా నీకు? నా కొడుకు పైన్నే చేయి చేసుకుంటావా?" హుంకరించాడు.

" కామేశం గారూ! ఆవేశ పడకండి. ముందు అతని కాలర్ వదలండి. స్కూల్ పరువు పోతుంది. అది మీకూ మంచిది కాదు. ప్లీజ్! " బతిమలాడ సాగాడు హెడ్మాస్టర్ .

స్కూల్ అసిస్టెంట్స్ కూడా నచ్చ చెప్పబోయారు.

"ఇంకా ఏం చూస్తున్నారు. నాలుగు తగిలించక..." ఎవడో అనుచరుడు చెయ్యి ఎత్తబోయాడు.

ఇంతవరకూ ఎంతో ఓర్పుగా ఉన్న హెడ్మాస్టర్ కి ఒక్కసారిగా కోపం ముంచుకొచ్చింది.

" చెయ్యెత్తితే మర్యాదగా ఉండదు. ముందు అందరూ బయటికి నడవండి." ఆయనలో ఆవేశం కట్టలు త్రెంచుకొంది.

'ఏంది? నోరు పెద్దదవుతోంది. మర్యాద ... గిర్యాద అంటున్నావు?" రెచ్చిపోయాడు కౌన్సెలర్

"చూడండి!... పొరబాటు జరిగింది. క్షమించండి. ఇక ఇలాంటివి జరుగకుండా చూస్తామని హామీ ఇస్తున్నాను. ఇంకేం కావాలి. అతన్ని కొడితే సమస్య తీరిపోతుందా? చెప్పండి."

"నో! దెబ్బకు దెబ్బ పడాల్సిందే!"

'అందరూ బయటికి పోతారా? లేక పోలీస్ ను పిలవమంటారా?" హెచ్చరించాడు హెడ్మాస్టర్ సహనం నశించి .

"పోలీస్ ను పిలస్తారట" ఆ హా...హా ...హా నవ్వారు అనుచరులు.

అటుగా పోతున్న పోలీసులకు ఎవరో ఉప్పందించినట్లుంది - అంతలోనే ప్రత్యక్షమయ్యారక్కడ.

"ఏం జరుగుతోందిక్కడ? మాస్టార్! " అంటూ యస్ ఐ లోపలి కొచ్చాడు.

“ రండి...రండి...యస్ ఐ గారూ! కూర్చోండి! చిన్న ప్రాబ్లెం ...కౌన్సెలర్ గారి అబ్బాయిని ...” హెడ్మాస్టర్ సన్నగా నసిగాడు.

కుర్చీలో కూర్చుంటూ “ కౌన్సెలరా! ఎవరూ...?” ఆరా తీశాడు యస్ ఐ.

అక్కడ పోలీస్ లు రావడం ఎదురు చూడని కౌన్సెలర్ అవాక్కయ్యాడు. ఎదురు చూడలేదేమో కంగారు పడ్డాడు. పరుగెత్తుకొచ్చి యస్ ఐ ముందు చేతులు కట్టుకొని వినయంగా నిలబడ్డాడు “నమస్తే సార్!" అంటూ.

“తమరేనా? ఏంటి... తమరి కన్ను స్కూల్ పైన కూడా పడిందా?”

దిక్కులు చూస్తూ నిలబడ్డాడు కౌన్సెలర్.

"వీళ్ళంతా ఎవరు? నీ గ్యాంగా?...కానిస్టేబుల్స్... వీరందరి పేర్లు నోట్ చేసుకోండి! "

"నేను కాదు... నువ్వు కాదు " అంటూ మెల్ల మెల్లగా అనుచరులు జారుకున్నారు. పోలీసులను చూసిన జనం ఎవరి దారిన వారెళ్ళిపోయారు.

"మీరేం చెప్పకండి మాస్టారూ! నాకంతా తెలిసింది. ఇక వీడిని నా కొదిలేయండి. " అంటూ కామేశం వైపు తిరిగి "కామేశం! ఇంతకీ మీ అబ్బాయెక్కడ?" అడిగాడు ఇన్స్పెక్టర్.

ఈ వింత చూస్తూ నవ్వుకుంటున్న అబ్బాయిని చూపించాడు కామేశం .

"చూశావా! ఎవడి కోసం నువ్వింత రాద్ధాంతం చేస్తున్నావో ...వాడు ఇవంతా చూసి నవ్వుకుంటున్నాడు. ఆ దెబ్బను వాడెప్పుడో మర్చిపోయుంటాడు. నువ్విక్కడ వెకిలి చేష్టలతో వినోదం పంచుతున్నావు. నీకూ చిన్నప్పుడు ఇలా పడుంటే ఈవేళ ఇన్ని కేసులుండేవి కాదు. బుద్ధిగా చదువుకోనుంటే బాగుపడుండేవాడివి. “

" చిన్నపుడు మీలా ఎవరూ చెప్పలేదు. అందుకే ... చదూకోలేదు సార్!. " నసిగాడు కామేశం.

" ఎవరూ చెప్పలేదా? ఐతే విను.కామేశం! ఈ దెబ్బ చూశావా?" అంటూ నుదుటి మీద గాయం తాలుకు మచ్చను చూపించాడు ఇన్స్పెక్టర్

."ఏమైంది సార్!"అదుర్దాగా అడిగాడు కామేశం.

“ఇది ఇరవై ఏళ్ళ క్రితం ఇదే హెడ్మాస్టార్ -అప్పుడు ఇంగ్లీష్ మాస్టార్ గా - చేసిన గాయం. నేను బాగా చదవలేదని - ఇంగ్లీష్ లో పూర్ గా ఉన్నానని కొట్టాడు. అలా కొట్టినప్పుడు నా తల గోడకు కొట్టుకొని రక్తం చిమ్మింది. మూడు కుట్లు పడ్డాయి. నేను స్పృహ తప్పి పడిపోయాను. అప్పుడు యస్ పి గా ఉన్న మా నాన్న ఏమన్నాడో తెలుసా? "శభాష్! శంకరం! మంచి పని చేశావు." అని సార్ని భుజం తట్టి నన్ను హాస్పిటల్ కు తీసికెళ్ళాడట. నాకు భయమేసింది. ఆ భయమే నా జీవితాన్ని మలుపు తిప్పింది. అప్పట్నుంచి బాగా చదవడం ప్రారంభమయింది. అప్పట్నుంచి క్లాస్ కు ఫస్ట్ వచ్చేవాణ్ణి. ఆ దెబ్బ మానిపోయింది. కానీ దాని వల్ల కలిగిన భయం ఇప్పటికీ ఉంది. ఆ భయం వల్లే నేడు ఇంతటి స్థితికి చేరుకున్నాను. ఆ దెబ్బే లేకుంటే ఇపుడు నేనీ స్థాయిలో ఉండేవాణ్ణే కాదు.

గురువులు శత్రువులు కాదు. తల్లి, తండ్రి తరువాత పిల్లల్ని దండించి దారిలో పెట్టే హక్కు వాళ్ళకే ఉంది. విద్యార్థులకు గురువులంటే భయమూ, భక్తీ, గౌరవం ఉండాలి. అవి లేకపోతే విద్యార్థి పైకి రాలేడు. నువిప్పుడు చేస్తున్న పనికి మీ వాడికే కాదు; ఇక్కడున్న విద్యార్థులం దరికీ గురువులంటే చులకన భావం ఏర్పడి వ్యవస్థ దెబ్బ తింటుంది. నువ్వెలాగూ చదువుకోలేదు. మీ పిల్లల్నైనా చదివించు. "

"అలాగే సార్! మీరు చెప్పాక ఇంక సమస్యేముంది సార్! మాస్టార్లు నన్ను క్షమించండి." అంటూ వంగి వంగి దండాలు పెట్టాడు కామేశం.

"ఓరేయ్! ఇప్పటికే చాలా చేశావు. ఇక పద. ఇకనైనా బుద్ధిగా నడుచుకో...లేదంటే తెలుసుగా నీ ఫైల్ రీ-ఓపన్ చేయాల్సుంటుంది." హెచ్చరించాడు ఇన్స్పెక్టర్ ప్రతాప్.

" లేదు... లేదు సార్! వస్తాను... వస్తాను." అంటూ వెళ్ళిపోయాడు కామేశం.

"చాలా థాంక్స్. ఇన్స్పెక్టర్ ప్రతాప్ గారు" హెడ్మాస్టర్ అన్నాడు.

"సార్! మీ దగ్గర చదువుకొని ఇంత వాణ్ణైన వాణ్ణి. నన్ను ప్రతాప్ అని పిలవండి చాలు"

ఇంతలో ఏకాంబరం వచ్చి, " మీ మేలు జన్మలో మర్చిపోలేను సార్! ఇక మీదట ఇలా జరక్కుండా జాగ్రత్త పడుతాను సార్!" అన్నాడు. 'చూడు ఏకాంబరం! ఉద్యోగం జాయినైన కొత్తలో ఇలాటివి మామూలే. కాకపోతే మీరు గుర్తు

పెట్టుకోవాల్సిందొకటుంది. కాలం మారింది. సమాజం మారింది. ఆ రోజుల్లో ఐదారు మంది పిల్లలుండేవారు. కొట్టినా; తిట్టినా పిల్లల మంచి కోసమే అని తలిదండ్రులు భావించేవారు. కాని, ఇప్పుడు ఒకరిద్దరితోనే సరిపుచ్చేస్తున్నారు. ఇప్పటి పిల్లలు చిన్న చిన్న విషయాలకే ఆత్మహత్యల దాకా వెళ్తున్నారు. తలిదండ్రుల ఆందోళన కూడా అర్థం చేసుకోండి. ఇదే పరిస్థితి మీ పిల్లలకి వస్తే ... ఆలోచించండి. గురువులకు విద్యార్థులంటే ప్రేమ,అభిమానం, వాత్సల్యం ఉండాలి. గురువుకు బెత్తం అవసరమే. విద్యార్థికి భయం అవసరమే. కాని, భయపెట్టడానికి బెత్తం ఉపయోగించాల్సిన అవసరం లేదు. ఉదాహరణకు కామేశాన్నే చూడండి. ఏ బెత్తమూ, ఆయుధమూ ఉపయోగించకుండానే మిమ్మల్నెలా భయపెట్టాడో నలుగుర్ని వెంటబెట్టుకొచ్చి? పోలీ సుల్ని చూడండి. వాళ్ళ చేతుల్లో తుపాకులు, లాఠీలు ఉన్నాయి. కానీ వాటిని ఉపయోగించలేదు. ఐనా కంట్రోల్ చేయగలిగారు. అవునా? కొంచెం తెలివి ఉపయోగించండి. టెక్నాలజీ ని ఉపయోగించుకోండి. సైకాలజీ చదవండి. మారండి." యస్ ఐ హితబోధ లోని హేతుబద్ధతను గుర్తించారందరూ.

"అలాగే సార్! బాగా చెప్పారు! నమస్తే! " అన్నాడు ఏకాంబరం.

"ఓ కే మాస్టార్! ఇక నేను బయల్దేర్తాను సెలవు." అంటూ కరచాలనం చేసి ముందుకు కదిలాడు ఇన్స్పెక్టర్ ప్రతాప్.

ఆనాటి ప్రతాపేనా వీడు...ఎంతగా ఎదిగిపోయాడూ" అంటూ హెడ్మాస్టర్ విస్తుపోయి చూస్తుండగానే జీపు కదిలింది. *




తెల్లవారురుఝామున నిద్రలేచి వాకింగ్ కి వెళ్ళొచ్చి, స్నానంచేసి పూజాకార్యక్రమాలు పూర్తి చేసుకుని పడక్కుర్చీలో విశ్రాంతిగా కూర్చున్నానో లేదో మా కోడలు కమ్మటి కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది తాగుతూ రుచిని ఆస్వాదిస్తున్నాను.నేను రిటైరయ్యి ఆరేళ్ళు కావొస్తోంది. ఉద్యోగం చేస్తున్నప్పుడు..ఇప్పుడూ కూడా నా దిన చర్య ఇదే. పెద్దాడు ఆఫీసుకి తయారవుతున్నాడు. కూతురు సెట్విన్లో ఫ్యాషన్ టెక్నాలజీలో ట్రైనింగ్ తీసుకుంటోంది. పెద్దాడికి రెండేళ్ళయింది పెళ్ళై. వాడికి రత్న మాణిక్యాల్లాంటి ఇద్దరు పిల్లలు. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు! చాలీ చాలని జీతం. నేనూ ప్రైవేటు కంపెనీలో పనిచేసి రిటైరయ్యాను. సంపాదించి వెనకేసిందీ లేదు పెన్షనూ లేదు. అదృష్టం కొద్దీ పుణిస్త్రీగా మూడేళ్ళ క్రితం ఈ లోకం విడిచిపెట్టింది మా ఆవిడ. మా అందరికీ మా అబ్బాయి సంపాదనే ఆధారం. అదృష్టవశాత్తు అబ్బాయీ కోడలూ మంచివాళ్ళు కాబట్టి కలో గంజో తాగి గుట్టుగా బ్రతుకుతున్నాం. జవసత్వాలుడిగి పోయి నా ఓపిక నశించింది. అందుకే మా అబ్బాయి ' నాన్నా, నువ్వు ఉద్యోగం చేసి మమ్మల్ని పెంచి పెద్దచేసింది చాలు. ఇహ ఇంటి పట్టునుండి విశ్రాంతి తీసుకోండి.' అన్నాడు. నా బెంగల్లా నా కూతురి పెళ్ళి గురించే. దానికి సరైన సంబంధం చూసి నా గొంతులో ప్రాణం వుండగానే పెళ్ళి చేసేయ్యాలి. పాపం మా అబ్బాయి 'నీ కెందుకు నాన్నా ఆ ఆలోచన? తను నాకు చెల్లెలే కదా! నాకూ బాధ్యత వుంది?'అంటాడు. అంతేకాకుండా సంబంధాలు కూడా చూస్తున్నాడు. కాని అమ్మాయితో పాటు డబ్బు గుమ్మరించలేని అసక్తత కుదరనివ్వడం లేదు. మనసులో ఓ మూల అదే నా బాధ. అంతే!

"నాన్నగారూ ఆఫీసుకి వెళ్ళొస్తాను" అని వాడు బయల్దేరబోతుంటే..బయట ఆటో ఆగిన చప్పుడైంది.

మా అబ్బాయి చుట్టాలెవరన్నా వచ్చారేమోనని హడావుడిగా చూడడానికి వెళ్ళాడు. నేనూ కళ్ళజోడు పెట్టుకుని వాడిననుసరించాను.

ఆటోలోంచి ఒక పెద్దాయన..మరో కుర్రాడు దిగారు. ఆటోకి డబ్బులిచ్చేసి ఆయన చేయి పట్టుకుని మావైపు ఆయన్ని నడిపించుకుంటూ తీసుకొచ్చాడు.

నన్ను చూడంగానే ఆ పెద్దాయన కళ్ళలో ఆనందం. నాకు మాత్రం ఆయన ఎవరో గుర్తురావడం లేదు.

"మీరు పరంధామయ్య..?"సంశయంగా ఆగాడు.

అవునన్నట్టుగా చిన్నగా తలూపాను.

ఆ యువకుడివైపు ' కరెక్ట్ అడ్రెస్ కే వచ్చాం' అన్నట్టుగా చూసి.."నేను విశ్వాన్ని.." అంటూ ఆగాడు.

ఈ మధ్య మతిమరపు ఎక్కువైంది. కాని ఆ పేరు మెదడు పొరల్లో బాగానే నిక్షిప్తమైపోయింది కాబట్టి తొందరగానే గుర్తుకొచ్చింది.

"లోపలికి రండి" అని లోపలికి దారితీశాను.

మా అబ్బాయికి అంతా అయోమయంగా వుందని నాకు తెలుసు. కారణం ఇంతవరకు నేనెప్పుడూ విశ్వం విషయం వాడిదగ్గర ప్రస్తావించలేదు.

లోపలికెళ్ళి అందరం కూర్చున్నాక"బాబు ఆఫీసుకి బయల్దేరుతున్నాడనుకుంటా..ఒక్క అరగంట వుండమను" అన్నాడు.

నేను కళ్ళతోటే వాడిని వుండమన్నాను. వాడూ కూర్చున్నాడు.

"బాబూ..నేను నీకు తెలియక పోవచ్చు. కాని మీ నాన్నకి బాగా తెలిసిన చేదు జ్ఞాపకాన్ని. ముప్పైఏళ్ళక్రితం నేనూ మీనాన్న మరో ఇద్దరం కలసి ప్రాణ స్నేహితులుగా వుండేవాళ్ళం. చక్కగా ఉద్యోగం చేసుకుంటూ ఒకరి యోగక్షేమాలు ఒకరం తెలుసుకుంటూ ఆహ్లాదంగా కాలం గడిపేవాళ్ళం. గొర్రెలాంటి జీతంలో ఓ సరదా అనేది లేకుండా జీవించడంపై నాకు నిరాసక్తత ఏర్పడింది. అప్పుడే నాకు ఇంకా బాగా సంపాదించాలన్న కోరిక కలిగింది. అది రోజు రోజుకి ఎదిగి నా మనసులో మర్రిమానయింది. నేను ఒక రోజు చిట్స్ వ్యాపారం ప్రారంభించాను. చిట్స్ లో జనాన్ని చేర్పించాలి కాబట్టి నా స్నేహితులైన మీ నాన్నని, మిగతా ఇద్దరిని కూడా 'వద్దు వద్ద'ని మొత్తుకుంటున్నా వినకుండా డైరెక్టర్లుగా నియమించుకున్నాను. వాళ్లని బలవంత పెట్టి వాళ్ళద్వారా ఎంతో మంది చేరేట్టు చూశాను. అలా వాళ్ళ స్నేహితులు చుట్టాలు తెలిసినవాళ్ళు చేరారు. మొదట్లో అంతా బాగుండేది. మేమందరం నాలుగు డబ్బులు కళ్ళ చూశాం. నేను ఆడంబరాలకి అలవాటయినా, మీ నాన్నతో పాటు మిగతావాళ్ళు మాత్రం నేల విడిచి సాము చేసే వారుకాదు. ఆ జోష్ లో.."ఊపిరి తీసుకోడానికి కాస్త ఆగాడు. అప్పటికి వచ్చినవాళ్ళకి ఏమీ ఇవ్వలేదన్న విషయం నాకు గుర్తుకొచ్చి 'వాళ్ళకి మంచి నీళ్ళు టిఫిన్ ఏర్పాటు చెయ్యమని' లోపలికెళ్ళి మా కోడలికి పురమాయించాను.

కాఫీ టిఫిన్లు పూర్తి అయ్యాయి.

నేను " మాకోడలు మనవడు మనవరాలు నా కూతురు" అని పరిచయ కార్యక్రమం పూర్తి చేశాను.

"వీడు మా అబ్బాయి"తనతో వచ్చినతన్ని పరిచయంచేసి"....అన్నట్టు ఇందాక ఎంతవరకు చెప్పాను..ఆ..గుర్తొచ్చింది..అలా జోష్ లో వుండగా ఆఫీసు పని పట్ల అనాసక్తి చూపిస్తూ ఊర్లూ వాడలూ తిరుగుతూ జనాల వేట మొదలెట్టాం. ఆఫీసులో ఇంక్రిమెంట్లు రాక పోవడం..మెమోలు రావడం మొదలెట్టాయి. కాని నేను ఎండమావుల వెంట పరిగెత్తసాగాను. నన్ను నమ్మి నా వెనక నా స్నేహితులు. అలా పరిగెడుతున్న సమయంలో.. అపశృతి" గొంతు జీరపోయి మాట్లాడ లేక పోయాడు. అప్రయత్నంగా నా కళ్ళలో కూడా నీళ్ళు తిరిగాయి అప్పటి పరిస్థితులు స్ఫురణకు వచ్చి.

కళ్ళు తుడుచుకుని, కాసిని మంచినీళ్ళు తాగి" పెద్ద చిట్లు పాడిన వాళ్ళు పారిపోయారు. అది బయటికి పొక్కి కట్టే వాళ్ళు కట్టక..పాడుకున్న వాళ్ళు డబ్బులు కట్టక చాలా ఇబ్బంది పడిపోయాను. తర్వాత తెలిసింది వాళ్ళు కావాలనే గ్రూప్ గా చేరి నన్ను ముంచే ప్లాను చేశారని. నేను విషయం తెలియగానే ఖాతాదారులందరూ డబ్బుకోసం నామీద దాడి చేస్తారు కాబట్టి భయంలో..అయోమయంలో..దొరికింది తీసుకుని రాత్రికి రాత్రి పెళ్ళాం పిల్లలతో ఊరు వదిలేశాను. నేను కావాలని చేసింది కాదు. పరిస్థితి అలా వచ్చింది. మోసం చెయ్యడం నా అభిమతం కాదు. కాని దొరికితే చంపేస్తారన్న భయం నాది. ఎంతోమంది తమ

భవిష్యత్తుకి రంగులద్దుకోవడం కోసం..రిటైరైనవాళ్ళు తమ

జరుగుబాటుకోసం, పిల్లల పెళ్ళిళ్లకోసం, చదువులకోసం దాచినదంతా దోచుకోబడింది. వాళ్ళ ఆశల మీద నీళ్ళు చల్లాను."అన్నాడు కళ్ళ నీళ్ళతో.

నాకు అప్పటి పరిస్థితులు గుర్తొచ్చాయి.వీడేమో వెళ్ళిపోయాడు. మాకేమో ఏం చెయ్యాలో తెలియలేదు. అందరూ మమ్మల్ని నానా దుర్భాషలాడారు. 'నీ వాటాగా ఎంత సంపాదించావని' కడుపు మంటతో ప్రశ్నించారు. నేను అక్కడ సంపాదించినదానికి నా దగ్గరున్నది కూడా కలిపి కొంతమందికి తీర్చేశాను. మరికొంతమంది" ఇదంతా మా కర్మ మీరేం చేస్తారులేండి" అని వదిలేశారు. కాని నేను చేసింది ముమ్మాటికీ తప్పే! 'సంస్థ జనాన్ని ముంచి తప్పుచేస్తే, నేను సంస్థని ప్రతి ఇంటి ముంగిట్లోకి..మనసులోకి తీసుకెళ్ళి తప్పుచేశాను. వాళ్ళ ఆశలు ఛిద్రమవడానికి నేనూ కారణమే' అన్న ఆలోచన నన్ను నిద్రాహారలకి దూరం చేసింది. చాలా కాలం ఈ లోకంలో లేను. అప్పుడు బాబూ పాప చాలా చిన్నపిల్లలు. మా ఆవిడ నా పరిస్థితికి తల్లడిల్లిపోయింది. నేను మనుషుల్లో పడడానికి నా భార్యతోపాటు నా మంచితనం మీద నమ్మకమున్న వాళ్ళూ కారణం.

వాడు మళ్ళీ ప్రారంభించాడు. " నేను వేరే ఊరైతే వెళ్ళానుగాని నా మనసు మీమీదే బెంగపెట్టుకుంది. నన్ను నమ్ముకుని నేను ప్రోత్సహిస్తే ఆ రొంపిలోకి దిగారు. మీ జీవితాలు కల్లోల సాగరంలో నావలయ్యాయి. 'మిమ్మల్ని అనవసరంగా క్షోభ పెట్టానన్న' ఆలోచన నన్ను నిలవనీయలేదు. దాంతో నేను కొన్నాళ్ళు పిచ్చివాడినయిపోయాను. తర్వాత తేరుకున్నాను. మళ్లీ మామూలు జీవితం మొదలెట్టాను. ఇప్పుడెందుకొచ్చానంటే?" అని కాస్త ఆగి "నాకు బి పి సుగరు వచ్చాయి. దిక్కుమాలిన రోగగ్రస్త జీవితం గడుపుతున్నాను. అన్నం తినకపోయినా ఫర్వాలేదు కాని మందులు లేకుండా ఉండలేని పరిస్థితి. ఈ మధ్యనే కిడ్నీలు పాడయ్యాయి. డయాలసిస్ తో నెట్టుకొస్తున్నాను. నా దురదృష్టకర జీవితంలో నాకు జరిగిన మంచి ఏమిటంటే, నా ఇద్దరు కొడుకులకి నేనంటే ప్రాణం. వీడు మా రెండో వాడు. నా కథ వీళ్లకి జ్ఞానోదయం కలిగించింది, ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. డబ్బొచ్చే సీట్లయినా నిప్పులా బ్రతుకుతున్నారు. "రేపు నేను చనిపోయాక..నా ఆత్మ శాంతికోసం శాంతులు చేస్తారు.

నేను పైలోకంలో సుఖంగా వుండడానికి గోదానం..భూదానం లాంటివి చేస్తారు. కాని అవి ఈ లోకంలో ఇంత పాపం చేసిన నా ఆత్మకి శాంతిచేకూరుస్తాయా? చెప్పు. అందుకే..అందుకే అప్పుడు నువ్వు కోల్పోయిన మానసిక ప్రశాంతతని ఇవ్వలేను కాని..అప్పుడు నువ్వు కోల్పోయిన డబ్బు ఇచ్చేస్తాను. ఇది నేను కష్టపడి నిజాయితీగా సంపాదించినది. నా డబ్బు ఒక్క పైసా కూడా అనవసరంగా కర్చుపెట్టలేదు . కేవలం మీకోసమే దాచాను. మీ కిద్దామనే తీసుకొచ్చాను. నా పిల్లలు కూడా నా పాపం వాళ్ళ కంటకుండా తాము సంపాదించినది కలిపారు. పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదంటారు. నేను బ్రతికుండగానే నా పాపం కొంతవరకైనా కడుక్కుందామని తాపత్రయ పడుతున్నాను. దయచేసి క్షమించరా..నీ చేతులు పట్టుకుని కాకుండా కాళ్ళమీదే పడి బ్రతిమాలుతున్నాను" అని హఠాత్తుగా నా కాళ్ళమీదకి జారిపోయాడు. నేను గబుక్కున వాడిని లేవనెత్తాను. వాడి ముఖంలో

అశాంతి కాస్త తొలగింది. తేటదనం చోటు చేసుకుంది.   "ఆ ఇద్దరి చిరునామాలు కూడా  అతికష్టం మీద సేకరించి పోయిన్నెల నా పాపం కడుక్కున్నాను. అంతేకాదు నావల్ల డబ్బు..మనశ్శాంతి పోగొట్టుకున్న కుటుంబాలవద్దకెళ్ళి చేసిన పాపం చెప్పి డబ్బిచ్చి కడుక్కున్నాను. ఇప్పుడు నాకు కాస్త మానసిక ప్రశాంతత దక్కింది. ఈ లోకంలో నేను చేసిన పాపం నేనే కొంతవరకు కడుక్కున్నాను. రేపు నేను చనిపోయాక వీళ్ళు గొప్ప గొప్ప దానాలు చెయ్యకపోయినా నా ఆత్మ శాంతిగానే వుంటుంది. నా ముందుతరాలకి ఎటువంటి క్లేశాలు భయాలు లేకుండా చేశాననే అనుకుంటున్నాను.. ఇప్పటి తరాల ఇన్నన్ని మానసిక శారీరక సమస్యలకి కారణం వాళ్ళ పెద్దవాళ్ళు తమ స్వార్థం కోసం చేసిన పనులేమో అని నాకు అనిపిస్తూంది. ఆ ఏడుపులు శాపనార్థాలు తర తరాలకీ వ్యాపిస్తాయి. నేను అటువంటిది లేకుండా చేయగలిగానన్న తృప్తి నాకు వుంది." అంటూ ముగించాడు."అది నేనెప్పుడో మర్చిపోయిన పీడకల. నువ్వొచ్చేదాకా నాకు గుర్తులేదు. అనుక్షణం నేను గుర్తుచేసుకుంటూ మానసిక చిత్రవధననుభవిస్తూ..నా పిల్లలకి చెబుతూ వాళ్ళకీ మనశ్శాంతి లేకుండా చేయలేదు. ఇహపోతే నువ్వు నా స్నేహితుడివి. అప్పుడూ ఇప్పుడూ కూడా. నువ్వు మోసగాడివి కాదు. కాని అప్పుడు అలా వదిలి వెళ్ళిపోవడం మాత్రం చాలా బాధకలిగించింది. అదీ తాత్కాలికమే!" అన్నాను మనస్పూర్తిగా.

డబ్బు మనిషిని శాసిస్తున్న పాపిష్టి రోజులివి. వాడిచ్చిన డబ్బు రేపు నా కూతురి పెళ్ళి చేయడానికి మేము సంతోషంగా గడపడానికి చాలా అవసరం. నాలాగే మిగతావాళ్ళూ ఆలోచించి వుంటారు. డబ్బు మా అందరికి కాస్త ఉపశమనాన్నిస్తుంది. వాడు చేసింది తప్పే కావచ్చు కాని సరిదిద్దుకున్నాడు. అప్పుడు శాపనార్థాలు పెట్టిన వాళ్ళే ఇప్పుడు దీవించి వుంటారు. వీడిలా ఎంతమంది వుంటారు? ఉద్యోగరిత్యానో..తమ స్వార్థం కోసమో ఎంతో మంది అన్యాయాలు చేస్తుంటారు. పూజలు ఘనంగా చేసి హుండీల్లో బారీగా కానుకలేసినంత మాత్రాన ప్రశాంతత లభిస్తుందా? వాళ్ళు ఈ లోకంనుండి నిష్క్రమించాక ఉన్న వాళ్ళు వాళ్ళ పేరిట ఎన్ని దానాలు చేస్తేమాత్రం నిష్కృతి లభిస్తుంది? ఆ విషయంలో విశ్వం చాలా నయం. వాడు పుణ్యలోకాలకి పోవడం ఖాయం. అనుకుంటుండగా అచేతనుడయ్యాడు. వాడి ముఖం ప్రశాంతంగా వుంది. బహుశా నా ఆలోచనలు చదువుతూ ఈ లోకం వదిలాడనుకుంటా..